ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
సోమవారం 13 అక్టోబర్ 2025

## సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

చిన్నమండెం అక్టోబర్ 12 ప్రభాతవార్త:



మండలంలోని బోరెడ్డిగారిపల్లి గ్రామంలో ఆదివారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు అధికారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి పలువురు అధికారులను ఆదేశించారు. పలు సమస్యలకు ప్రత్యక్షంగా పరిష్కారాన్ని అందించిన మంత్రి ప్రజల్లో విశేష విశ్వాసాన్ని నెలకొల్పారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ పరిష్కారమే ప్రధానంగా ప్రతి సమస్యకు తక్షణ స్పందన, పరిష్కారమే లక్ష్యం చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రికి పలువురు నాయకులు దుశ్వాలువాలతో సన్మానించారు.

## శిల్పారాభంలో స్టెప్స్‌తో అదరగొట్టిన విద్యార్థులు

కడప కార్పొరేషన్ సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

ఆదివారం కడప శిల్పారామంలో కడప నగరానికి చెందిన సరేశ్వర్ డాన్స్ అకాడమీ విద్యార్థులు పల్లె, జానపద, శాస్త్రీయ నృత్యాలు పాటు సినీ జీతాలకు స్టెప్స్ వేసి ప్రేక్షకులను అలరించారు. రాను రాను బొంబాయికి రాను, వస్తావా జానకి, ఇస్మార్ట్ శంకర్ వంటి పాటలకు స్టెప్స్ తో అదరగొట్టారు. ఈ సంస్కృతి కార్యక్రమాలు శిల్పారామం పరిపాలన అధికారి యస్. కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు.




# కల్తీ మద్యం సృష్టికర్త మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి

### కల్తీ లిక్కర్ వ్యవహారంలో తన పాత్రపై కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధం

### వాస్తవాలు తెలుసుకొని మాట్లాడటం నేర్చుకోండి

### మీడియా సమావేశంలో ధ్వజమెత్తిన మంత్రి మండిపల్లె

రాయచోటి, అక్టోబర్ 12 ప్రభాతవార్త

కల్తీ మద్యం సృష్టికర్త మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అని కల్తీ లిక్కర్ వ్యవహారంలో తన పాత్ర పై కాణిపాకంలో ప్రమాణానికి నేను సిద్ధం నువ్వు సిద్ధమని అని అన్నారు. ఆదివారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయం నందు మంత్రి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాజీ సిఎం జగన్, వైసిపి మీద పలు కీలక వాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ జగన్ తన హయంలో అంతా తానే చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నాడే తప్ప వాస్తవానికి చేసిందేమీ లేదన్నారు. అందుకు సంబంధించిన వివరాలు అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆరోగ్యశాఖాంత్రి మెడికల్ కళాశాలల గురించి వివరించినట్లు తెలిపారు. అప్పట్లో మెడికల్ కళాశాలలకు కేంద్రం నుంచి వచ్చిన నిధులను కూడా జగన్ దుర్వినియోగం చేశారన్నారు. ఇప్పుడు మాత్రం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకారణ చేస్తున్నారని గగ్గోలు పెట్టడం సరికాదన్నారు. మెడికల్ కళాశాలలకు రూ 150 కోట్లు మీ ప్రభుత్వం ఖర్చు చేసిందని అందులో కేంద్రం రూ 950 కోట్లు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ 500 కోట్లు పిజి సీట్లు తాకట్టుపేటారని, జగన్ చేసిందేమీ లేదన్నారు. జగన్ ఖర్చు చేసిన వాటా ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రాతినిథ్యం వహిస్తున్న పులివెందులలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలను వందశాతం పూర్తిచేశారా అని ప్రశ్నించారు. 85 శాతం పూర్తిచేసి 250 పోస్టులు జగన్, ఎంపీ అవినాష్ రెడ్డి అమ్ముకున్నారని ఆరోపించారు. మదనపల్లి మెడికల్ కళాశాల ఎంత వరకు పూర్తి చేశారో చెప్పాలని నిలదీశారు. నర్సీపట్నం వెళ్లిన జగన్ జనాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారే తప్ప మరొకటి లేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో రాష్ట్రంలో ఆరోగ్యసేవలు మెరుగుపడ్డాయన్నారు. కానీ జగన్ ఇవన్నీ పక్కనపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. వైద్య రంగం, పేదప్రజలపై జగన్ కు చిత్తశుద్ధి లేదన్నారు. వైద్య బీమాతో రాష్ట్ర ప్రజలకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పీపీపీ మోడల్ అంటే ప్రైవేటుకు కట్టబెట్టడం కాదని, ఇతర శాఖల మాదిరిగానే మెడికల్ కళాశాలలను కూడా ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో మద్యనిషేధం చేస్తామని చెప్పి జగన్ మాట తప్పారని మంత్రి రాంప్రసాద్ రెడ్డి విమర్శించారు. దీనికి తోడు వ్యాపారస్తులను నిలువునా ముంచుతూ మద్యం షాపులన్నీ ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారని చెప్పారు. ఎక్కడా డిజిటల్ పేమెంట్ లేకుండా ప్రజా సొమ్మును కొల్లగొట్టారని ఆరోపించారు. దీంతో ఎంపీ మిథున్ రెడ్డితో పాటు మరికొందరు ఈ కారణంగానే జైలు పాలయ్యారన్నారు. మిథున్ రెడ్డి 71 రోజులు జైలు జీవితం గడిపినట్లు తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డి కూడా మద్యం సిండికేట్ నడిపి ఈరోజు కూటమిపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాసిరకం మద్యాన్ని తయారు చేసే విధానాన్ని కనిపెట్టి వ్యాపారం చేసింది వైసిపి నాయకులు అని, జగన్ సోదరుడు అనిల్ రెడ్డి సౌత్ ఆఫ్రికాలో మద్యం వ్యాపారం చేస్తూ ఇక్కడ కూడా అక్రమ మద్యాన్ని తయారు చేసే కంపెనీలను తయారు చేశారన్నారు. దీనివలన మంచి కంపెనీలన్నీ రాష్ట్రం వదిలి వెళ్లే విధంగా ఒత్తిడి తీసుకువచ్చి తరిమేశారన్నారు. జైలు పాలైన వారికి క్లీన్ చీట్ ఇచ్చారని చెప్తున్నారు.. కానీ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదని, న్యాయపరమైన లొసుగులు అడ్డం పెట్టుకుని కండిషన్ బెయిల్ మీద బయటకు వచ్చారని అన్నారు. మొలకల చెరువులో బయటపడిన కల్తీ లిక్కర్ వ్యాపారం పై జగన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, తనపైన ఆరోపణలు చేశారని చెప్పారు. అక్రమ మద్యంలో తన పాత్ర పై కాణిపాకంలో ప్రమాణం చేసే దానికి సిద్ధమని, తనపై ఆరోపణలు చేసిన వారు కాణిపాకానికి రావాలని సవాల్ విసిరారు. మా పార్టీ వారు తప్పు చేస్తే మా అధినాయకుడు చంద్రబాబు వెంటనే చర్యలు తీసుకుంటారని తెలిపారు. అందులో భాగంగానే టాస్క్ ఫోర్స్ విభాగం పని చేస్తుందని తప్పు చేసిన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మీ హయాంలో దళిత డ్రైవర్ ను చంపిన ఎమ్మెల్సీని వెంటబెట్టుకుని తిరుగుతున్నారని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. రౌడీలకు ఆశ్రయం ఇస్తూ విమర్శలు మాత్రం ఇతరులపై చేయడం సమంజసం కాదన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం జగన్ పార్టీకి అలవాటైందన్నారు. లిక్కర్, ఇసుక, మైనింగ్ ఇలా అన్ని రంగాలలో అవినీతి అక్రమాలు జరిగింది జగన్ హయాంలోనే అన్నారు. మీకు వచ్చిన ఓట్లు కోటి అయితే కోటి సంతకాలు ఎలా పెట్టిస్తారని ఎద్దేవా చేశారు. జగన్ ను ప్రజలు మర్చిపోతారని, కేవలం గుర్తింపు కోసమే ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రజల పైన ఎలాంటి ప్రేమాభిమానాలు లేవని మంత్రి అన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

### ఖాజీపేటలో తీగ లాగితే...

## ఢిల్లీలో ఎర్రచందనం డొంక కదిలింది...

### రూ.8 కోట్ల రూపాయల విలువైన 10 టన్నుల ఎర్రచందనం స్వాధీనం

### ఇద్దరు అంతర్ రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్


అంతరాష్ట్ర స్మగ్లర్ల నుంచి పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దొంగలు

రాజంపేట,అక్టోబర్12 ప్రభాతవార్త

కడప జిల్లాలోని కాజీపేట మండలం పత్తూరు ప్రాంతంలో రెండు నెలల క్రితం తమిళనాడు ప్రాంతానికి చెందిన ఎర్రచందనం స్మగ్లర్ను అరెస్ట్ చేసి ఎర్రచదనం దొంగలు స్వాధీనం చేసుకున్న సంఘటనలో అదికారులు విచారణలో తీగ లాగితే డొంక కదిలింది. ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ నిఘాబృందం ఢిల్లీకి వెళ్లి ఇద్దరూ అంతరాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేయడమే కాకుండా వారి వద్ద నుంచి 8 కోట్ల రూపాయలు విలువైన పది టన్నుల ఎర్రచందనం పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ బృందం కడప జిల్లా ఖాజీపేట మండలంలోని పత్తూరు ప్రాంతంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాజ్కుమార్ అనే ఎర్రచందనం స్మగ్లర్ను 02.08.2025 అరెస్ట్ చేసి కేసు నమోదు చేసారు. స్మగ్లర్ ను విచారించారు. విచారణలో మరికొందరు అంతరాష్ట్ర స్మగ్లర్లు ఢిల్లీలో ఉన్నట్లు బయటపడింది. వెంటనేఅంతర్ రాష్ట్ర ఎర్రచందన అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ పోలీసులు ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లో అంతర్రాష్ట్ర ఎర్రచందన స్మగ్లర్ల ముఠాలోని ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్టు చేసి, సుమారు 356 ఎర్రచందనం దుంగలు 8 కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నారు. దీని ప్రకారం టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ నేతృత్వంలో ఇన్స్పెక్టర్ షేక్ ఖాదర్ బాష నేతృత్వంలో ప్రత్యేక బృందం ఢిల్లీకి పంపబడింది. ఆ బృందం స్థానిక ఢిల్లీ పోలీసులు, ఫారెస్ట్ అధికారుల సహకారంతో సౌత్ ఈస్ట్ ఢిల్లీ తుఘ్లకాబాద్ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ప్రధాన నిందితుడు మొహమ్మద్ ఇర్ఫాన్ ను 06.10.2025 న అరెస్ట్ చేసి, అతని ఇచ్చిన సమాచారంతో తుఘ్లకాబాద్, కుయన్ మొహల్లా ప్రాంతంలోని గోదాం నంబరు 366 పై దాడి చేసి, అతనికి సహకరించిన అమిత్ సంపత్ పవార్ ను కూడా అరెస్ట్ చేశారు. గోదాంలో అక్రమంగా దాచిన 356 ఎర్ర చందనం దుంగలు (9.576 టన్నులు) స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిందితులను స్థానిక ఢిల్లీ కోర్టులో హాజరుపరచి, ట్రాన్సిట్ వారెంట్ పై తిరుపతికి తీసుకువచ్చారు. ఈ కేసులో సంబంధం ఉన్న ప్రధాన స్మగ్లర్లను గుర్తించి అరెస్టు చేయడానికి దర్యాప్తు కొనసాగుతోంది. అవసరమైతే నిందితులపై పిడి యాక్ట్ కూడా ప్రయోగించడం జరుగుతుందని ఈ ఆపరేషన్ను విజయవంతంగా నిర్వహించిన టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ తెలిపారు. యాపరిషన్లో పాల్గొన్న డీఎస్పీలు వి. శ్రీనివాసరెడ్డి, ఎం.డి. షరీఫ్, ఇన్స్పెక్టర్ షేక్ ఖాదర్ బాష, ఎస్ఐ రఫీ, ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి, పీసీలు వంశీ కృష్ణ, షేక్ బిలాల్, చిన్న కృష్ణయ్య లను టాస్క్ ఫోర్స్ హెడ్ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, తిరుపతి ఐఎఫ్ఎస్ అధికారి సెల్వం సి. చంద్రన్ అభినందించారు.

## టిడిపి నాయకుడు అంజన్‌రెడ్డి పరామర్శించిన మంత్రి

రామాపురం అక్టోబర్12. ప్రభాతవార్త



మండల టిడిపి నాయకుడు అంజన్‌రెడ్డిని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. మండలానికి చెందిన అంజనారెడ్డి ఇటీవల అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న విషయం తెలుసుకొని ఆదివారం మంత్రి ఆంజనరెడ్డి గృహానికి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట మంత్రి మేనల్లుడు మోర్యరెడ్డి, కుప్పం నియోజకవర్గం పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా, సరస్వతి పల్లి సింగల్ విండో అధ్యక్షుడు గాలివీటి సురేందర్ రెడ్డి, కొలిమి వాండ్లపల్లె డైరెక్టర్ సహదేవరెడ్డి అర్చన విద్యా సంస్థల అధినేత మదన్ మోహన్ రెడ్డి, మండల నాయకులు దేవదర్శన్‌రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, పట్టాభిరెడ్డి, బీసీ నాయకుడు రమణయ్య యాదవ్, శివారెడ్డి పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని యువకుడు మృతి

దువ్వూరు, అక్టోబర్ 12, ప్రభాతవార్త:

మండల పరిధిలోని జిల్లా సరిహద్దు అయిన ఇరమడక వద్ద అరుణ్ కుమార్(19) అనే యువకుడు ఉరి వేసుకొని మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి... నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం యాదవాడకు చెందిన అరుణ్ కుమార్ ఆళ్లగడ్డలో ఓ డిగ్రీ కాలేజీలో బీకాం చదువుతున్నాడు. ఇతను ఆ పరిసర ప్రాంతాల్లోని ఒక బాలిక ప్రేమ విషయం ఇంటి పెద్దలకు తెలియడంతో వారు మందలించాలని ఇంటికి పిలవడంతో భయపడ్డాడు. దీంతో స్నేహితుని యొక్క బండి తీసుకొని కడపనంద్యాలకు సరిహద్దులో ఒక పాడుబడ్డ దాబాలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దాబా ఇడమడక, చాగలమర్రి గ్రామాల మధ్యలో కడప జిల్లా పరిధిలో ఉంది. దీంతో ఇతని బంధువులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

## రాయితీపై 60 క్వింటాళ్లు శనగలు మంజూరు

దువ్వూరు, అక్టోబర్ 12, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పెద్ద జొన్నవరం గ్రామానికి రాయితీపై 60 క్వింటాళ్లు శనగలు మంజూరు అయినట్లు మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి తెలిపారు. దువ్వూరు మండలంలో ప్రతి ఏడాది రబీ సీజన్ లో పెద్ద జొన్నవరం గ్రామానికి మాత్రమే శనగలు మంజూరు అవుతాయని అందులో భాగంగా 60 క్వింటాళ్లు కేటాయించామని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు క్వింటాకు 7800 రూపాయలు ఉంటుందని అందులో 1950 రాయితీ పోను 5850 రూపాయలు చెల్లించి రైతు సేవా కేంద్రంలో శనగలు తీసుకోవచ్చు అన్నారు. అవసరమైన రైతులు వీటిని వినియోగించుకోవాలని తెలిపారు.

## మైనారిటీలకు అండగా కూటమి ప్రభుత్వం

వేంపల్లె: అక్టోబర్:12(ప్రభాత వార్త)



మంత్రి ఫరూఖ్‌ని మైనారిటీ రైట్స్ ఫోరం(ఎంఆర్ఎఫ్) నేతలు కలిశారు. ఆదివారం నంద్యాలలోని మంత్రి కార్యాలయంలో ఎంఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్.దస్తగిరి, అధికార ప్రతినిధి డా. షేక్ ఇబ్రహీంలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం ముస్లిం మైనార్టీలకు సంబంధించి సబ్సిడీ రుణాలు, పేద విద్యార్థులకు స్కాలర్షిప్, వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ, స్థలాల సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. అలాగే వేంపల్లె ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలకు సంబంధించిన విద్యార్థినుల ప్రొటెక్షన్, కళాశాల డెవలప్మెంట్ అంశాలను కూడా ప్రస్తావించారు. అంతేకాకుండా కడప టౌనులో అమీన్ పీర్ దర్గా(పెద్ద దర్గా)వక్ఫ్ బోర్డు పరిధిలో ఉందని, దర్గాకు సంబంధించి ఏ ఉత్సవమైన వక్ఫ్ బోర్డు అనుమతితో జరగాలని కోరారు. ఇదివరకు ఇతరులు వక్ఫ్ బోర్డు అనుమతి లేకుండా ఇష్టానుసారంగా ఉరుసు ఉత్సవాన్ని నిర్వహించి అందినంతా దోచుకుతిన్నట్లు ఆరోపించారు. ఉరుసు ఉత్సవాలు బహిరంగా టెండర్లు ఏర్పాటు చేసి, అనుమతి పొందినవారికి కేటాయించాలని, వక్ఫ్ బోర్డు ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని మంత్రిని వారు విన్నవించారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి అందుకు తగిన చర్యలు తీసుకుంటామని, ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా మైనార్టీలకు అండగా నిలుస్తోందన్నారు. అలాగే ఇచ్చిన ప్రతి హామీపై తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి మోలానా జాకీర్, ఆళ్లగడ్డ ముస్లిం జేఏసీ కన్వీనర్ బీరువాల బాషా, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అస్రఫ్ అలీఖాన్, సల్ఫియా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ సయ్యద్ అన్వర్, ఆల్ ఇండియా ముస్లిం సేవా సమితి చాంద్ బాష, మైనారిటీ వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఇబ్రహీం, అడ్వైజర్ మస్తాన్ వల్లి, మైనారిటీ రైట్స్ ఫోరం నాయకులు గౌసుల్లా, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ స్థలాలపై

# పెత్తందారుల...పెత్తనం...

### పిజిఆర్ఎస్ ఫిర్యాదులతో రగులుతున్న రచ్చ

ఓబులవారిపల్లి అక్టోబర్ 12, ప్రభాతవార్త

మండలంలో ప్రభుత్వ స్థలాలపై పెత్తందారుల పెత్తనం రోజురోజుకు ముదిరి పాకాన పడుతోందని తెలుస్తోంది. కొందరు పిజిఆర్ఎస్ పేర్లతో రెవెన్యూ అధికారులకు సర్వే నెంబర్లతో సహా పిజిఆర్ఎస్‌లో పెట్టడంతో వాటిని అధికారులు పరిశీలించి ఆ భూమి వివరాలు రికార్డులపై అధికారులకు రిపోర్టులు పంపడం ఆనవాయితీగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఓబులవారిపల్లి మండలం చిన్నవరంపాడు రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 1907, 1908లో దాదాపు నాలుగు ఎకరాల పైబడి ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు గతంలో పట్టాల ద్వారా తమ ఆధీనంలో ఉంచుకొని సాగు చేసుకుంటూ ఆ తర్వాత రియల్ ఎస్టేట్‌గా మార్చి కొందరికి ఇంటి స్థలాల పేరుతో విక్రయించడంతో అదే గ్రామానికి చెందిన కొందరు పిజిఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేసి వారికి ఇద్దరు మధ్య లోపామకారి ఒప్పందాలు కుదుర్చుకోవడంతో. మరి కొంతమంది తమకు కూడా భూమిలో కొంత వాటా ఇవ్వాలంటూ కొంత భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించగా అక్కడ మధ్యలోకి వచ్చిన ఓ వ్యక్తిపై యజమాని చేయి చేసుకుని ఇరువురు మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఏది ఏమైనా అత్త సొమ్ము అల్లుడు దానం అన్న చందంగా ఇక్కడ ప్రభుత్వ భూములు వ్యవహారం సాగుతుందని సమాచారం. ఈ భూములు పంపకాలలో అటు యజమానులకు ఇటు రౌడీ మామూలు ఇవ్వాలంటూ వస్తున్న కొంతమంది మధ్య రచ్చ రగడ రగులుతోందని. ప్రభుత్వం పందారంలో పెత్తందారీ వ్యవస్థకు అద్దం పట్టినట్లు కనిపిస్తోంది. ఎక్కడ ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారికి ఆక్రమించినంత వందల ఎకరాలలో ఉంటే పేదలకు ఇచ్చిన పట్టాలు కొందరు అనుభవిస్తున్న భూములపై అనవసరంగా బురద సొల్లుతో అనార్హులపైన దళితులపైన దళితులు భూములపైన విమర్శలు ఆరోపణ చేస్తూ కొందరు ఇబ్బందులు గురిచేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పై సర్వే నెంబర్లు భూమిపై విచారణ జరిపించి అర్హులకు తగిన న్యాయం చేయాలని చిన్నఓరంపాడు ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తాసిల్దార్ వివరణ కోరగా భూరి కార్డులు పరిశీలించి రికార్డుల ప్రకారం ఉన్న ప్రభుత్వ స్థలంగా గుర్తించామని ఈ సర్వే నెంబర్లుపై పూర్తి సమగ్రతమైన విచారణ జరిపించి సబ్ కలెక్టరుకు పూర్తి సమాచారాన్ని అందించామని తాసిల్దార్ వివరించారు.



### మార్కెట్ యార్డ్ నందు

# ఈనామ్ విధానంపై సమావేశం

### మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్

పులివెందుల, అక్టోబర్ 12 ప్రభాత వార్త :

పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ఆదేశాల మేరకు నేడు అనగా 13.10.2025 సోమవారం ఉదయం 11:00 గంటలకు, పులివెందుల మార్కెట్ యార్డ్ నందు ఈనామ్ విధానం అమలుపై సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీ గడ్డం అమర్నాథ్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.రైతులకు అత్యంత ప్రయోజనకరమైన జాతీయ వ్యవసాయ మార్కెట్ ఈ నామ్ విధానం, దాని అమలు ప్రణాళిక మరియు భవిష్యత్తు లక్ష్యాలపై వివరణ ఇవ్వనున్నట్లు ఈ నామ్ విధానంను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున ప్రతి ఒక్కరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి అని ఆయన కోరారు.

# హంద్రీ నీవా కాలువలో విద్యార్థి గల్లంతు

### నీటి ఉధృతికి స్నేహితుల కళ్లెదుటే నీట మునిగిన విద్యార్థి

మదనపల్లెక్రైమ్, అక్టోబర్ 12 ప్రభాతవార్త.

స్కూల్లో స్పెషల్ క్లాసులకు వెళుతున్నానని తల్లిదండ్రులకు చెప్పిన పదోతరగతి విద్యార్థి క్లాస్ అనంతరం స్నేహితులతో కలిసి హంద్రీనీవా కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లి గల్లంతైన విషాదకర ఘటన ఆదివారం సాయంత్రం మదనపల్లెలో జరిగింది. కుటుంబసభ్యులు, విద్యార్థి స్నేహితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన సురేష్, సరళ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సాయికిరణ్(16) బసినికొండలోని ఓ ప్రైవేట్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం స్కూల్లో పదోతరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు ఉండటంతో. సాయికిరణ్ సాయంత్రం 4.30 వరకు క్లాసులు ఉన్నాయని తల్లిదండ్రులకు చెప్పి స్కూటీలో వచ్చాడు. మధ్యాహ్నం 1 గంట వరకు క్లాసుకు హాజరయ్యాడు. స్కూల్ వదిలాక నేరుగా ఇంటికి వెళ్లకుండా మెయిన్ రోడ్డులో వరకు వచ్చి, తర్వాత స్నేహితులైన భానుతేజ, శేషుబాబు, సాత్విన్ రెడ్డిలతో కలిసి ఈత కొట్టడానికి స్కూటీలో పాఠశాల వెనుక వైపు ఉన్న హంద్రీనీవా కాలువ వద్దకు చేరుకున్నారు. కాలువలో అప్పటికే కొందరు యువకులు ఈత కొడుతుండటం చూసి సాయికిరణ్ కాలువలోకి దిగాడు. కాలువలో నీటిప్రవాహ ఉధృతి అధికంగా ఉండటం గమనించని సాయికిరణ్ కాలువలో ముందుకు వెళ్లడంతో పట్టుతప్పి పడిపోయాడు. గమనించిన శేషుబాబు గట్టిగా కేకలు వేస్తూ,ఈత కొడుతున్న యువకులను కాపాడాల్సిందిగా కోరాడు. వారు వెంటనే అక్కడకు వచ్చి సాయికిరణ్ను పట్టుకునే ప్రయత్నం చేయగా, చేతికి చిక్కి చేజారిపోయాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వారు అగ్నిమాపక సిబ్బందికి తెలపడంతో సంఘటనాస్థలానికి చేరుకుని విద్యార్థి ఆచూకీ కోసం సాయంత్రం వరకు గాలించారు. విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. జరిగిన ఘటనపై విద్యార్థి స్నేహితులను అడిగి తెలుసుకున్నారు. కంటికి రెప్పలా పెంచుకున్న బిడ్డ నీట మునిగి గల్లంతవడంపై జీర్ణించుకోలేక, తీవ్ర ఆవేదనతో గుండెలవిసేలా రోదించారు. విషయం తెలుసుకున్న ప్రజలు పెద్ద సంఖ్యలో హంద్రీ నీవా కాలువ వద్ద గుమికూడారు. సాయంత్రం 6.30 వరకు గాలించినా విద్యార్థి ఆచూకీ లభించకపోవడంతో ఫైర్, పోలీస్ సిబ్బంది వెనుదిరిగారు. సోమవారం ఉదయం పుంగనూరు నియోజకవర్గం ఈడిగపల్లె సమీపంలోని అక్కింవారిపల్లె ఎత్తిపోతల ప్రాజెక్ట్ వద్ద విద్యార్థి ఆచూకీ కోసం గాలించాలని నిర్ణయం తీసుకున్నారు.



విద్యార్థి కోసం గాలిస్తున్న దృశ్యం, విద్యార్థి (ఫైల్‌ఫొటో)


సంఘటన స్థలం వద్ద రోధిస్తున్న విద్యార్థి బంధువులు

# సంప్రదాయ స్వీట్లతో నోళ్లు తీపి చేస్తూ..



తినే పదార్థాల నుంచి తాగే పానీయాల దాకా.. ప్రస్తుతం మార్కెట్లో అన్నీ కల్తీ అవుతున్నాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు వీటిలో ప్రిజర్వేటివ్స్ కలపడం, కంటికి ఇంపుగా కనిపించేందుకు వీటి తయారీలో ఆర్టిఫిషియల్ రంగులు వాడ డం.. ఎక్కడ చూసినా ఇలాంటి పాశ్చాత్య పద్ధతులే దర్శనమిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో భారతీయ ఆహార సంప్ర దాయాలకు విలువ నిస్తున్నారు బెంగళూరుకు చెందిన శ్వేతా రాజశేఖర్. కనుమరుగవుతోన్న ప్రాచీన పాకశాస్త్ర పద్ధతుల్ని వెలికి తీసి.. ఆ సూత్రాలతో ఆరోగ్యక రమైన మిఠాయిల్ని తయారు చేస్తున్నా రామె. పాశ్చాత్య పోకడలు రాజ్యమేలు తున్న తరుణం లోనూ సంప్రదాయ స్వీట్లతో భారతీయుల నోళ్లు తీపి చేస్తూ.. నాటి మధురిమల్ని అందిస్తున్నారు శ్వేత. మరి ఆమె సక్సెస్ గురించి తెలుసుకుందాం..

**వ్యాపారమంటే ఇష్టం !....** నాకు ముందు నుంచీ వ్యాపారంలో స్థిరపడాలని కోరిక! పెళ్లయ్యాక ఇది మరింత బలపడింది. ఎందుకంటే నా భర్త విశ్వనాథ్ కూడా వ్యాపారవేత్తే! ప్రస్తుతం ఆయన ఇళ్ల నిర్మాణం, వ్యవసాయానికి సంబంధించిన వ్యాపారాలు



నిర్వహిస్తున్నారు. మాకు అబ్బాయి పుట్టేదాకా ఉద్యోగంలో కొనసాగిన నేను.. ఆపై జాబ్ వదిలేసి కొన్నాళ్లు ఇంటికే పరిమితమయ్యా. నా కొడుకు కాస్త పెద్దయ్యాక మావారి వ్యాపారంలో చేరాను. ఈ క్రమంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన విషయాలు, వ్యాపార మెలకువలు నేర్చుకున్నా. నేనే సొంతంగా వ్యాపారం ప్రారంభించాలన్న ఆలోచనకు వచ్చా. అది కూడా కనుమరుగవు తోన్న మన దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా ఉండాలనుకున్నా. అయితే ముందు నుంచీ నేను ఫుడ్ లవర్‌ని. అందులో నూ స్వీట్స్‌ని బాగా ఇష్టంగా తింటాను. 2020లో ఇండియా స్వీట్ హౌజ్ పేరుతో వ్యాపారం ప్రారంభించేలా చేసింది. అంటారు శ్వేత.

**అందుకే.. మా స్వీట్లు ప్రత్యేకం....** సాధారణంగా స్వీట్ల తయారీలో పాలు, వెన్న, నెయ్యి.. వంటి పదార్థాల్ని ఎక్కువగా వాడుతుంటారు. అయితే వీటిలోనూ మార్కెట్లో ఎక్కువగా కల్తీ ఉత్పత్తులే దొరుకుతున్నాయని గ్రహించిన శ్వేత.. అక్కడి నీలమంగళ అనే ప్రాంతంలో కర్మ ఫార్మ్స్ పేరుతో 20 ఎకరాల్లో ఓ వ్యవసాయ క్షేత్రాన్ని నడుపు తున్నారు. వివిధ రకాల మొక్కలు, చెట్లతో అలరాలే ఈ తోటలో పశుపోషణను ప్రధానంగా నిర్వహిస్తున్నారామె. మా ఫామ్‌లో దాదాపు 150 ఆవులున్నాయి. వీటి నుంచి తీసిన చిక్కటి పాలు. ఈ పాలతో తయారుచేసిన వెన్న, నెయ్యి.. వంటి స్వచ్ఛమైన పదార్థాల్ని మా స్వీట్ల తీయారీలో వాడుతున్నాం. అలాగే ఎక్కడా ప్రిజర్వేటివ్స్, ఆర్టిఫిషియల్ కలర్స్ ఉపయోగించకుండా.. సహజసిద్ధంగా, ప్రాచీన పాకశాస్త్ర పద్ధతుల్లో వీటిని తయారు చేస్తున్నాం. అలాగే ఈ మిఠాయిల తయారీలో చక్కెరకు బదులు బెల్లాన్ని ఉపయోగిస్తున్నాం. ప్రస్తుతం మా వద్ద అంజీర్ బర్ఫీ, కాజూ బర్ఫీ, కాజూ కత్లీ, డ్రైఫ్రూట్ లడ్డూ, కొబ్బరి బర్ఫీ, పదుల సంఖ్యలో బెంగాలీ స్వీట్లు, ఆయా రాష్ట్రలకు సంబంధించిన ప్రత్యేకమైన స్వీట్లు తయారుచేస్తున్నాం. అలగే స్నాక్స్, పానీయాలు, చాట్స్.. వంటివీ మా వద్ద దొరుకుతాయి. ఇక ఆయా కాలాల్లో దొరికే పండ్లతో నోరూరించే మిఠాయిలు, పానీయాలు, వినియోగ దారుల్ని ఆకట్టుకుంటాయి. అంటూ తన వ్యాపారం గురించి చెబుతున్నారీ బిజినెస్ లేడీ.

**ప్యాకింగూ సహజంగానే....** స్వీట్ల తయారీలోనే కాదు.. వాటిని వినియోగదారులకు అందించే ప్యాకేజింగ్ కోసం కూడా సహజసిద్ధమైన పద్ధతుల్నే అనుసరిస్తున్నారు శ్వేత. ఈ క్రమంలో ఆకర్షణీయమైన ప్యాకేజింగ్‌ని అందిస్తూనే.. ఆ బాక్సుల్ని తిరిగి ఇతర అవసరాల కోసం ఉపయోగించు కోవచ్చుంటున్నారామె. నా వల్ల నా వ్యాపారం వల్ల పర్యా వరణానికి హాని కలగకూడదనేది నా సిద్ధాంతం. అందుకే స్వీట్ల ప్యాకేజింగ్‌కీ ఒకసారి వాడి పడేసేవి కాకుండా.. తిరిగి ఉపయోగించుకునే స్వీట్ బాక్సులు, కంటెయినర్స్‌నే వాడుతున్నా. అలాగే ఆయా సందర్భాల్ని బట్టి మా ప్యాకేజింగ్ కూడా విభిన్న శైలిలో ఉంటుంది. అందుకే స్వీట్ల రుచిలోనే కాదు.. ప్యాకేజింగ్ లోనూ మీ స్టైలే వేరు అంటుంటారు చాలామంది కస్టమర్లు. అంటూ చెప్పుకొచ్చారు శ్వేత.

**బ్యాలన్సింగ్.. తేలికే !...** తన వ్యాపారంతో నలుగురూ ఉపాధి పొందాలని కోరుకున్న శ్వేత. తన సంస్థలో ఎక్కువమంది మహిళల్ని పనిలో పెట్టుకున్నట్లు చెబుతున్నారు. నా చుట్టూ ఉండే మహిళలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో నా సంస్థలో మహిళల్నే ఎక్కువగా పనిలో పెట్టుకున్నా. ఇక చాలామంది మీరు ఇటు ఇంటిని, అటు బిజినెస్‌ను ఎలా బ్యాలన్స్ చేయగలుగుతున్నారు అని అడుగుతుంటారు. నా దృష్టిలో ఇది కష్టమనుకుంటే కష్టం. తేలిక అనుకుంటే తేలిక. సరైన ప్రణా ళిక, సమయపాలనతోనే ఈ రెండింటినీ బ్యాలన్స్ చేయగలుగు తున్నా. అలాగే మా వారి ప్రోత్సా హం కూడా నన్ను ముందుకు నడిపిస్తోంది. సవాళ్లు అనేవి ప్రతి రంగంలో సహజం. వాటిని అధిగమించి, సృజనాత్మకంగా ఆలోచించినప్పుడే ఉన్నత స్థితికి చేరుకోగలం.. అంటూ తన మాటలతో ఔత్సా హిక మహిళా వ్యాపారవేత్తల్లో స్ఫూర్తి నింపుతున్నారీ మామ్ అంత్రప్రెన్యూర్. ప్రస్తుతం బెంగళూరు వ్యాప్తంగా 30కి పైగా స్టోర్స్‌ని ఏర్పాటుచేసిన శ్వేత.. త్వరలోనే ఇతర రాష్ట్రాలకూ తన వ్యాపారాన్ని విస్తరించనున్నట్లు చెబుతున్నారు.

# వర్షాకాలంలో వంటింట్లో !

**ఈ సీజన్‌లో నిత్యావసర వస్తువులు, కాయగూరలు, పండ్లు, ఆకుకూరలు, మిగిలిన ఆహార పదార్థాలను సరైన పద్ధతిలో నిల్వ చేయాల్సి ఉంటుంది. లేదంటే త్వరగా పాడయ్యే ప్రమాదం ఉంది.**

అత్యవసరానికి ఉపయోగపడేలా కట్ చేసి ఫ్రిజ్‌లో భద్రపరిచే క్యారెట్, బీన్స్, అలాగే ఒలిచిన బఠాణీ, మొక్కజొన్న గింజలను పొడి డబ్బాల్లో నింపాలి. తడి లేదా చెమ్మను పీల్చే సిలికకా జెల్ ప్యాకెట్స్ మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. వీటిని ఈ డబ్బాల్లో ఉంచితే చాలు.కట్ చేసిన కూరగాయల నుంచి వచ్చే తేమను ఈ ప్యాకెట్స్ పీల్చుకోవడంతో పాడవకుండా ఉంటాయి. అలాగే కూరగాయలను ముందుగా తడి లేకుండా పొడి వస్త్రంతో తుడిచి గాలికి ఆరనివ్వాలి. ఆ తర్వాత పొడిగా ఉండే ప్లాస్టిక్ కవర్లలో నింపి లోపల కాస్తంత చోటు ఉండేలా వదులు చేసి అందులో టిష్యూ ఉంచాలి. కవర్‌ను గాలి చొరబడకుండా ముండి వేయాలి. వీటని ఫ్రిజ్‌లో ఉంచితే చాలు. కాయగూరల నుంచి వచ్చే తేమను టిష్యూ పీల్చుకుంటుంది. దీంతో వారం రోజులపాటు కవర్లలో ఉన్నవి తాజాగా ఉంటాయి. అలాగే ఆకుకూరలను పేపర్‌టవల్‌లో చుట్టి, ఆ తర్వాత పొడి ప్లాస్టిక్ కవర్లలో ఉంచి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచితే చాలు. వారం రోజులైనా పాడవకుండా ఉంటాయి. అంతేకాదు,ఓ డబ్బాలో అడుగున టిష్యూ పరిచి కరివేపాకు లేదా కొత్తిమీర నిపాలి. తిరిగి పైన మరో పేపర్‌టవల్ కప్పి డబ్బా మూత పెట్టాలి. భద్రపరిస్తే రెండు వారలకు పైగా తాజాగా ఉంటాయి.

**ఆహార పదార్థాలు..** అన్నం మిగిలిన కూరలు తదితర ఆహార పదార్థాలనుఫ్రిజ్‌లో భద్రపరచాలనుకుంటే ముందుగా చల్లార్చి ఆ తర్వాతే నిల్వ ఉంచాలి. అలా కాకుండా వేడివేడి పదార్థాలను ఉంచితే వాటి నుంచి



వచ్చిన ఆవిరి అందులోనే ఉండి ఆహారాన్ని పాడయ్యేలా చేస్తుంది. అలాగే ఫ్రై చేసిన ఆహారపదార్థాలు ఈ సీజన్‌లో త్వరగా మెత్తబడతాయి. అలా కాకుండా ఉండాలంటే అడుగున పేపర్‌టవల్ పీల్చుకొని ఆహారపదార్థాన్ని మెత్తబడనివ్వకుండా, క్రిస్పీగా ఉంచు తుంది. అలాగే పప్పుదినుసులు నింపే డబ్బాల్లో ఒక ఎడుమిర్చి లేదా బిరియానీ ఆకు వేసి మూత పెడితే మంచిది. వాతావరణంలోని తేమకు పురుగుపట్టదు. వంటింటి దిమ్మ, కబోర్డుల వద్ద పరిశుభ్రత పాటించాలి. కడిగిన గిన్నెలను అరనిచ్చి పొడి వస్త్రంతో తుడిచిన తర్వాతే అలమరలలో సర్దుకోవాలి. లేదంటే ఆ చెమ్మకు బొద్దింకలు లేదా చిన్నచిన్న పురుగులు చేరతాయి. వంటగదికి ఎగ్జాస్ట్ ఫ్యాన్ తప్పనిసరి. అప్పుడే వంటగది పొడిగా పొడిగా ఉండి, బ్యాక్టీరియాలకు నివాసం కానివ్వదు.

# వారిపై చెడు ప్రభావం పడేలా..

**ఏం తల్లో ఏమో! పిల్లలను సరిగా పట్టించుకోదు.. సమయానికి వండి పెట్టదు.. అంత చిన్న వాళ్లపై దెబ్బ ఎలా వేయాలనిపిస్తుందో.. పక్కవాళ్లు తమ చిన్నారు లతో ప్రవర్తించే తీరుపై ఇలా ఎప్పుడోకప్పుడు ఇంట్లో మాట్లాడు కుంటూనే ఉంటాం కదా? మన పెంపకం తో పోలిస్తే ఆ పిల్లలకు ఏదో అన్యాయం జరిగి పోతోందని భావిస్తాం కానీ.. అది మనవాళ్లపై చెడు ప్రభావం పడేలా చేస్తుందని తెలుసా?**



తమ పిల్లలు ఆరోగ్యంగా, సంతోషంగా పెరగాలనే ఏ తల్లి అయినా కోరుకునేది. ఎంత ఓపికగా ఉందామనుకున్నా కొన్నిసార్లు శరీరం సహకరించకపోవడం, కుటుంబ పరిస్థితులు వగైరా సహనాన్ని కోల్పోయేలా చేస్తాయి. దాంతో ఓ దెబ్బ వేస్తారు. పోనీ.. ఆఫీసులోనో, బయటికి వెళ్లినప్పుడో ఆలస్యమవుతుంది. దీంతో కాస్త ఆలస్యంగా వండి పెట్టారు. ఇవన్నీ తప్పా ఒప్పా అన్నది పక్కన పెడితే. వీటి గురించి పదే పదే మాట్లాడితే ఆ దుష్ప్రభావం పడేది మీ పిల్లల మీదే చిన్నారులకు అమ్మానాన్నలే తొలి మార్గదర్శకులు. చాలా విషయాలు మిమ్మల్ని చూసే నేర్చుకుంటారు. మీరిలా వాళ్ల తీరు బాలేదు అని అసహనాన్ని చూపిస్తున్నాం అనుకుంటున్నారు కానీ. పిల్లలకి ఆ అసహనాన్ని తెలియకుండానే అలవాటు చేస్తున్నారు. దీంతో వాళ్లు అన్నకున్నది ఏది జరగకపోయినా దాన్నే ఇంట్లోనూ ప్రదర్శింస్తుంటారు. ఆ ఇంటి పరిస్థితులు మనకు తెలియదు.. అయినా జడ్జ్ చేసేసైతం. అంటే అవతలివాళ్లవైపు నుంచి ఆలోచించాల్సిన అవసరం లేదన్నది నేర్పిస్తున్నట్లేగా? పైగా వాళ్లఇక ఏది ఇవ్వకపోయినా మంచి అమ్మానాన్నలేనా అని ఆలోచిస్తారట. ఇతరుల తల్లిదండ్రులు అన్నీ అమరుస్తుంటే వాళ్లే సరైన అమ్మానాన్నలు అనీ భావిస్తారట. అంతేకాదు, చిన్న చిన్న విషయాలకే నెగెటివ్‌గా ఆలోచించడం నేర్చుకుంటారీనీ చెబుతున్నారు నిపుణులు. కాబట్టి, పిల్లల ముందు అలా ఇతర తల్లిదండ్రుల గురించి నిందిస్తూ మాట్లాడొద్దు. ఇంకా వీలుంటే వాళ్లు లేనప్పుడో,ఆరోగ్యం బాలేనప్పుడో వీలైనంత సాయం చేయండి. ఇతరులతో మంచిగా మెలగడం, సాయం చేయడం వంటివి నేర్పినవారవుతారు.

# విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ ను ఇవ్వాలి

బద్వేలు, అక్టోబర్ 12, ప్రభాతవార్త




ఈనెల 15వ తేదీ నుండి సమ్మెలోకి పోతామంటున్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి నాణ్యమైన విద్యుత్తును ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎంఎల్ లేబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ ఎస్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి న్యాయమైన డిమాండ్ తీర్చాలని ఆ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయని రైతులకు సరిపడా విద్యుత్ ఇవ్వకుండా మోసం చేస్తున్నారని వేలాపాల లేకుండా విద్యుత్ కోతలు పెరిగిపోయాయని చిన్నపాటి వర్షానికి గంటల తరబడి విద్యుత్ కోతలు ఉండడంతో పట్టణ కేంద్రాలలో ప్రజలు, వ్యాపారవేత్తలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యంతో విద్యుత్తు ట్రాన్స్ఫారంలో, సబ్ స్టేషన్ల మరమ్మత్తులకు నిధులు కేటాయించకపోవడంతో విద్యుత్ కోతలు ఏర్పడుతుందని విద్యుత్ అధికారులు చెబుతున్నారని వారన్నారు .ఒకవైపు రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ఓట్లు వేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి మొండి చేయి చూపటం దుర్మార్గమన్నారు ఇప్పటికే విద్యుత్తు అధికారులు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాలలో ఆందోళనలు చేసి ఈనెల 15వ తేదీన సమ్మెలోకి పోతున్నామని హెచ్చరించడం కూటమి ప్రభుత్వ చేతకానితనమని వారు ఎద్దేవా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 63600 మంది ఉద్యోగులు సమ్మెలోకి పోతుంటే విద్యుత్తు సంస్థల యాజమాన్యాలు, కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం హేయమైన చర్య అన్నారు .విద్యుత్ ఉద్యోగులు న్యాయమైన కోరికలైనా కాంట్రాక్ట్, లేబర్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని విద్యుత్ ఉద్యోగుల పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత పరిమితమైన వైద్య సౌకర్యం కల్పించాలని జూనియర్ లైన్మెన్ గ్రేడ్ 2 ఎనర్జీ అసిస్టెంట్లకు పాత నిబంధనలు వర్తింపజేయాలని వారికి అసిస్టెంట్ లైన్మెన్‌గా ప్రాధాన్యత ఇవ్వాలని పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల డిఎ, డిఆర్‌లను మంజూరు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం కరెంటు సబ్స్టేషన్ల, మరమ్మత్తుకు, ట్రాన్స్ఫార్మలకు, స్తంభాలకు, వైర్లకు, నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ ఎంఎల్ నాయకులు పాల్గొన్నారు

## ర్యాలీనీ విజయ వంతం చేయాలి

పులివెందుల,అక్టోబర్ 12 , ప్రభాతవార్త :

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లో జరుగుతున్న నకిలీ మద్యానికి వ్యతిరేకంగా పులివెందుల చేపట్టే ర్యాలీ నీ విజయవంతం చేయాలని పులివెందుల వైకాపా పార్టీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులకు ,ప్రజలకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కూడా తయారుచేసి ప్రజల ప్రాణాలని హరిస్తున్నటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నేడు అనగా 13.10.2025 సోమవారం ఉదయం 9:00 గంటలకు పాత ఎమ్మెల్యే కార్యాలయం నుండి సెంట్రల్ బోలేవార్డ్ మీదుగా మునిసిపల్ ఆఫీస్ కి ఎదురుగా ఉన్న మినీ సెక్రటేరియట్ నందు గల ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ గా వెళ్లి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం ఎక్సైజ్ సిఐ వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందనీ కావున ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

## ట్యాంకర్ ఢీకొని వాహనదారుడు మృతి

పీలేరు అక్టోబర్ 12 ప్రభాతవార్త :

ట్రాక్టర్ ట్యాంకర్, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చింతలవారిపల్లె సమీపంలోని నాయుడుపేట అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డుపై జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె ఈశ్వరమ్మ కాలనీకి చెందిన మణికంఠ (27) ద్విచక్రవాహనంపై తిరుపతి నుంచి మదనపల్లెకు బయలు చేరాడు. మార్గ మధ్యంలోని చింతలవారిపల్లె వద్ద వెళ్తున్న ట్రాక్టర్ ట్యాంకర్ ప్రమాదవశాత్తు రెండూ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విద్రవాహనం నుజ్జునుజ్జు అయిపోయగా ట్రాక్టర్ ట్యాంకర్ రెండుగా విడిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. మణికంఠ అక్కడికక్కడే తీవ్ర రక్తగాయాలతో మృతి చెందాడు పంచనామా నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానిక ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శక్తి యాప్ సేవలు వినియోగించుకొని

# పోలీసు భద్రత పొందండి

**- జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శక్తి యాప్ గురించి అవగాహన**

**- రిమ్స్ పీఎస్ ఎస్సై సుభాష్ చంద్రబోస్**

కడప, అక్టోబరు 12, ప్రభాతవార్త:

శక్తి యాప్ మహిళలు బాలికల రక్షణకు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని రిమ్స్ పీఎస్ ఎస్సై సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి ఆదివారం సాయంత్రం కడప నగర శివార్లలోని శిల్పారామం సందర్శకులకు ఎస్సై సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తియాప్ డౌన్‌లోడ్ చేసే విధానం వివరించి మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించారు. ఏదైనా అపాయం లేదా అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నప్పుడు శక్తి యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చన్నారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112కు కాల్ చేసిన కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100/112, చైల్డ్‌లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర, ప్రతి మహిళా, బాలిక తమ భద్రత కోసం ప్రభుత్వం కల్పించిన చట్టాలను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వివరించి వారిని చైతన్యవంతులను చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, శక్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.

## కారు బోల్తా ... స్వల్ప గాయాలు

పులివెందుల,అక్టోబర్ 12 , ప్రభాత వార్త :



పులివెందుల నియోజకవర్గం వేముల మండలం గొందిపల్లె గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం కారు టైరు పగిలి బోల్తా పడిన సంఘటనలో పులివెందులకు చెందిన వైసీపీ నాయకులు రాష్ట్ర మాజీ సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డికి మరియు వారి కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలు అయ్యాయి. పని మీద వెళ్ళి పులివెందులకి తిరిగి వస్తుండగా కారు టైరు పగలడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. హాల్ గంగాధర్ రెడ్డికి మరియు అతని సోదరుడికి మరి వ్యక్తికి గాయాలు అయ్యాయి. కారు బోల్తా పడిన సమయంలో వేంపల్లిలో సమావేశం పూర్తి చేసుకొని పులివెందులకు వస్తున్న డీఎస్పీ మురళి నాయక్ ప్రమాదం జరిగిన సమయానికి సంఘటన స్థలం వద్దకు యాదృచ్ఛికంగా వచ్చారు. కారు బోల్తా పడి గాయాలు అయిన వారిని వెంటనే డి.ఎస్.పి తన వాహంలోనే పులివెందుల వైయస్సార్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన జరిగిన విధానం గురించి ఆరా తీశారు. గాయా లైన వారిని ఆసుపత్రికి తరలించి వారికి చికిత్సను అందించే ఏర్పాట్లు చేశారు. డి.ఎస్.పి మురళి నాయక్ చూపిన దాతృత్వాన్ని అందరూ కొనియాడారు.



## అనాధ శవానికి అంత్యక్రియలు



ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 12 ప్రభాతవార్త:

స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌లో కుంభం సురేష్ రైల్ ప్రమాదంలో మరణించగ అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు రాకపోవడంతో పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా మేఐహెల్ప్యూ ఫౌండేషన్ ని సంప్రదించగా వారు స్పందించి ఆదివారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ ఛైర్మన్ మోరే లక్ష్మణ్ రావు,టౌన్ ప్రెసిడెంట్ అహమ్మద్ హుస్సేన్,ట్రెజరర్ భార్గవ్ సాయి,నవీన్,బాల మురళీ, బ్రహ్మయ్య,కృప ఆగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు మైఖేల్ బాబు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన ద్విచక్రవాహనం

గాలివీడు, అక్టోబర్ 12(ప్రభాతవార్త):



అరవీడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనం నుజ్జు నుజ్జయింది. స్థానికుల కథనం మేరకు ఆదివారం మధ్యాహ్నం అరవీడు ఆంజనేయస్వామి ఆలయం కూర్మయ్యగారిపల్లె మలుపు వద్ద ఆగిఉన్న ఆర్టీసీ బస్సును మద్యం మత్తులో ఉన్న వాహన చోదకుడు వేగంగా వచ్చి వెనుక నుండి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. అయితే మద్యం మత్తులో ఉన్న వాహనచోదకుడు బస్సును తప్పించే ప్రయత్నంలో వాహనం నుండి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదంలో బస్సును ఢీకొన్నపుడు పెద్ద శబ్దం రావడంతో బస్సులోని సిబ్బంది, ప్రయాణికులు కిందకు దిగి వాహనదారున్ని మందలించడంతో బైక్‌ను అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ప్రమాదానికి కారణమైన వాహనదారుడు వివరాలు తెలియాల్సి ఉంది.

## నిరుపయోగంగా గెస్ట్ హౌస్



గాలివీడు, అక్టోబర్ 12(ప్రభాతవార్త):

వెలిగల్లు జలాశయం వద్ద సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన గెస్ట్‌హౌస్ వినియోగంలో లేక నిరుపయోగంగా మారింది. బోటింగ్‌కు వెళ్లే దారిలో ప్రాజెక్ట్ పర్యవేక్షణ కోసం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన గెస్ట్ హౌస్ చుట్టూ కంపచెట్లు పిచ్చిమొక్కలతో బూత్‌బంగ్లాను తలపిస్తోంది. దీనిపై అధికారులు దృష్టి కేంద్రీకరించకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గెస్ట్‌హౌస్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి సద్వినియోగం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## లారీ ఢీకొని బర్రె మృతి

బద్వేలు ,అక్టోబర్ 12, ప్రభాతవార్త



పట్టణంలోని మిద్దెలవారిపాలెంలో ఉండే పునగాని పుల్లయ్యకు చెందిన లక్ష రూపాయలు విలువైన ఎనుము లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే చనిపోయిందనీ రైతు పుల్లయ్య తెలిపాడు. ఆ బర్రె ద్వారా వచ్చే పాలు అమ్ముకొని జీవనం సాగ్నిచేవారమని, దాదాపు లక్ష రూపాయలు విలువైన ఎనుము చనిపోవడంతో దిక్కుతో స్థితిలో ఉన్నామన్నారు. కొత్తగా నిర్మిస్తున్న హైవే రోడ్డుపైకి ఎనుము వెళ్లడంతో ఈ ఘటన జరిగిందని పుల్లయ్య తెలిపారూ. కొత్తగా వేస్తున్న రోడ్డుకు ఎటువంటి కంచే లేకపోవడంతో పశువులు రోడ్డుపైకి వెళ్లి చనిపోవడం జరిగిందని ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. ఎనుము మీద ఆధారపడి జీవించే ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారిందనీ అధికారులు ఆలోచించి తమ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

## ఎమ్మెల్యే మాదవిని కలిసిన జిల్లా ఎన్ జిజివో నేతలు

కడప కార్పొరేషన్ అక్టోబర్ 12 ప్రభాతవార్త:




కడప టీడిపి అతిధి గృహంలో ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యులు రెడ్డెప్పగారి మాదవి రెడ్డిని, టీడీపీ జిల్లా అధ్యక్షలు ఆర్.శ్రీనివాసులరెడ్డిలను, ఏపీ ఎన్జిజివో జిల్లా అధ్యక్షలు బి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి పి నిత్యపూజయ్య లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఏపీ ఎన్ ఎన్ జి జి ఓ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షలు తిమ్మారెడ్డి, కోశాధికారి టీ శ్రీనివాసులు, జిల్లా నాయకులు బాలపులయ్య నరేంద్ర, శ్రీను, పద్మనాభం పాల్గొన్నారు.

# అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

పెండ్లిమర్రి, అక్టోబరు 12, ప్రభాతవార్త:

మండలంలోని పాతసంగటిపల్లె గ్రామానికి చెందిన గంగాదేవి(40) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినది. వివరాల్లోకి వెళ్తే.. పాత సంగటిపల్లెకు చెందిన గంగాదేవి ఈనెల 9వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లింది. మళ్లీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మిస్సింగ్ కేసు నమోదు చేయడం జరిగింది. అయితే ఆదివారం పాతసంగటిపల్లె సమీపంలోని జింకల వంకలో శవమై తేలడంతో గంగాదేవిగా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**పాస్‌పోర్ట్ పోయినది**

ఇబ్రహీం మహమ్మద్ అలీ షేక్, తండ్రి మహమ్మద్ అలీ షేక్ ఆరీ ఫుల్లా, డోర్ నెం. 3/83, కత్తి వారి వీధి, చెన్నూరు గ్రామం, మండలం, కడప వైఎస్ఆర్ జిల్లా పాస్ పోర్ట్ నెం. N9809801 గల పాస్ పోర్ట్ పోయినది.ఈ సెల్ నెం. 8885934635కు తెలుపగలరు.

# సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదం

**పోరుమామిళ్ళ రూరల్, అక్టోబర్ 12 ప్రభాతవార్త:**

సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అయ్యాయని సిఎం చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు పదే పదే చెప్పడం హాస్యాస్పదమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం పోరుమామిళ్ళలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలలో ప్రధానమైన హామీలు ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదన్నారు. నిరుద్యోగ యువతకు సంబంధించి ప్రతినెల నిరుద్యోగ భృతి కింద ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు ఇస్తామని చెప్పి 16 నెలలు అయినప్పటికీ ఇప్పటివరకు మూడు రూపాయలు ఇవ్వలేదు. రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. ఈ విధంగా నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసగించిందని తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. 19-59 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500లు ఇస్తామని, 16నెలలు అయినప్పటికీ ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఈ విధంగా ఆడబిడ్డలను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసగించిందని ధ్వజమెత్తారు. ఎస్సీ,ఎస్టీ,బిసి,మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని సూపర్ సిక్స్ హామీల్లో చెప్పి ఇప్పటివరకు అతిగతి లేదు. రాష్ట్రంలో 17 లక్షల మంది


సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

అర్హులు ఉన్నారు. ఈ విధంగా ఎస్సి ,ఎస్టి ,బీసీ, మైనారిటీలను నమ్మించి మోసగించింది కూటమి ప్రభుత్వమన్నారు. ఇప్పటికైనా వట్టి మాటలు కట్టిపెట్టి వచ్చే నవంబర్ ఒకటో తారీకు నుంచి ప్రధానమైన ఈ మూడు హామీలను అమలు చేయాలని తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పిసిసి సభ్యులు, పోరుమామిళ్ల మండల శాఖ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్, ముజాహిద్, సలావుద్దీన్, రఫీ, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన రోటరీ క్లబ్

**ప్రొద్దుటూరు అక్టోబర్ 12 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ వైద్యులు సాధికార రోటరీ క్లబ్ ఐ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి రోటరీ క్లబ్ 3160 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎంకే రవీంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు అలాగే ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు కోటా శివకుమార్ ప్రధాన కార్యదర్శి ఎంఎన్ ప్రభు రొటేరియన్ బేపారి జాకీర్ అహ్మద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ డిస్టిక్ గవర్నర్ ఎంకే రవీంద్ర మాట్లాడుతూ గత 121 సంవత్సరాలుగా ప్రొద్దుటూరులో రోటరీ క్లబ్ అనేక రకాల సేవలు కంటి పరీక్షలకు సంబంధించి హాస్పిటల్ ఏర్పాటు చేసి రెండు లక్షలకుపైగా శస్త్ర చికిత్సలు చేయడం అభినందనీయమన్నారు. తాను డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ఎన్నికై మొదటి సారి ప్రొద్దుటూరుకు వచ్చానని తనకు అన్ని రకాలుగా ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ సభ్యులు మరియు మాజీ డిస్టిక్ గవర్నర్ గోపాలకృష్ణ సాదులు సహాయ సహకారాలు అందించి ప్రజలకు మరిన్ని సేవలు అందేలా చూడాలని ఆయన ఆకాంక్షించారు. ఇటీవల ఏపీ ప్రభుత్వంతో క్యాన్సర్‌కు సంబంధించి వ్యాక్సిన్ను మహిళలకు ఇచ్చేందుకు రోటరీ క్లబ్ ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషకరమన్నారు దీనివల్ల ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ కు కూడా వ్యాక్సిన్లు అందుబాటులో ఉంటాయని సభ్యులంతా ఐక్యమత్యంతో ప్రజలకు అందించి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు రోటరీ క్లబ్ అధ్యక్షులు కోటా శివకుమార్ మాట్లాడుతూ ఎంతో పరికరాలతో కంటి వైద్య చికిత్సలు అందిస్తున్న సంస్థ ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ అని తెలిపారు ప్రధాన కార్యదర్శి ఎంవిఎన్ ప్రభు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రొ



ద్దుటూరు శాఖ అనేక రకాలుగా సేవలు అందించిందని తెలిపారు క్యాన్సర్ వ్యాక్సిల్లో ప్రజలకు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో రోటరీ క్లబ్ ఒప్పందం గుర్తుంచుకోవడం అభినందనీయమన్నారు. రొటెరియన్ జాకీర్ అహ్మద్ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలు విస్తృతంగా అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ కు చెందిన గుండె వైద్యుడు రాజశేఖర్ వర్మ పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో అవసరమైన వారికి ఈసీజీ తో టుడిఎకో పరీక్షలు ఉచితంగా చేయడమే కాకుండా మందులు కూడా ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ సభ్యులు గజ్జల వెంకటేశ్వర్ రెడ్డి శ్రీ శ్రీ హోలీ స్టిక్ ఆస్పత్రి మేనేజర్ నరసింహారావు పిఆర్వో ప్రతాప్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ గడియారం వెంకట శేష శాస్త్రి విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకు ఎంతో సంతోషకరం

**ప్రొద్దుటూరు అక్టోబర్ 12 ప్రభాతవార్త**

తెలుగు భాష పండితుడు శివ భారతం రచయిత నాటి తన గురువు శ్రీ గడియారం వెంకట శేష శాస్త్రి విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకు ఎంతో సంతోషకరమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని మున్సిపల్ పార్కుల శ్రీ శివభారతి విద్యాపీఠం ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన మహా కవి డాక్టర్ గడియారం వేంకటశేష శాస్త్రి విగ్రహాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడియారం రచించిన శ్రీ శివ భారతం మహాకావ్యం ఆయనకు ఎనలేని కీర్తిప్రతిష్టలు తెచ్చిందన్నారు. బ్రిటీష్ వారి పాలనా కాలంలో దేశ స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా శివాజీ మహారాజ్ పై గడియారం రచించిన ఈ కావ్యం ఆంగ్లేయులపై వీర గాథ అన్నారు. తాను 1954-60 ప్రాంతంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్లో చదువుకునే సమయంలో తెలుగు బోధించేవారని, ఆయన కుమారుడు వ్యాయామ ఉపాధ్యాయునిగా సేవలందించే వారన్నారు. తనకు విద్యను నేర్పించిన గడియారం విగ్రహాన్ని తాను ఆవిష్కరించడం తనకు గర్వకారణంగా ఉందన్నారు. కవిగా తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేయడంతో పాటు రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా సేవలందించిన మహనీయుడని కొనియాడారు. ప్రాసమణి బిరుదాంకితుడు అన్నదాత సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాను గడియారం విగ్రహావిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆయన కావ్యాలలోని రచన వచనాలు అద్భుతమన్నారు. గో సంరక్షణ పై విద్యార్థులకు నిర్వహిం



చిన వ్యాపరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు తస్లీమా, షాహీనా, వైష్ణవిలకు వరుసగా రూ.3116. రూ.2116. రూ.1116లతో పాటు మెమెంటో అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య. వ్యాపారవేత్త కామరాజు దండపాణి, దండపాణి శ్రీనివాసకుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మారెళ్ల మల్లిఖార్జునరావు, శివభారతి విద్యాపీఠం అధ్యక్షుడు గడియారం నాగేశ్వరశర్మ, కార్యదర్శి గడియారం వేంకట శేషశర్మ, సంస్కృతి స్వచ్ఛంధ సేవాసంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి. గడియారం సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్. నారాయణరెడ్డి, గడియారం కుటుంబీకులు, కవులు, పురప్రముఖులు ఆ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వైకాపాచే డాక్టరేట్ ఈశ్వరయ్యకు సన్మానం


సన్మానిస్తున్న దృశ్యం

**మదనపల్లె, అక్టోబర్ 12 ప్రభాతవార్త :**

భారత్ యూనివర్శిటిచే డాక్టరేట్ అందుకొన్న కురబలకోట ఈశ్వరయ్యకు వైఎస్ఆర్ సిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఆదివారం వైకాపా కార్యాలయంలో ఆయనకు శాలువకప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ కురబలకోట మండలం తెట్టు గ్రామం ఎనుములవారిపల్లెకు చెందిన ఈశ్వరయ్యకు జాతీయ స్థాయిలో న్యూ ఢిల్లీలోని భారత్ యూనివర్శిటి డాక్టరేట్ ఇవ్వడం అభినందనీయమన్నారు. రుషివ్యాలీస్కూల్‌లో విద్యను అభ్యసించి అంచలంచెలుగా విద్యావిదానంపై ఉన్నత స్థాయికి అదిరోహించిన ఈశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యావిదానంపై పలువురికి ఆయన పలు సూచనలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెట్టు సర్పంచ్ మనోహర్‌రెడ్డి, వైసిపి నాయకులు వివిఎస్.రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, దస్తగిరి, చిప్పిలి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాంప్రదాయ వైద్యుల నైపుణ్యతపై అవగాహన



**సుండుపల్లి, అక్టోబర్ 12, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని అగ్రహారం నందు ఆయుర్వేద దేశీయ సాంప్రదాయ అను వంశిక వైద్యుల చిరునామా మరియు నైపుణ్యత నమోదు ప్రారంభం కార్యక్రమం సందర్భంగా మన వైద్యులు 20మంది పాల్గొన్నారు. అందరు కూడా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషం వ్యక్తం చేశారు. మన వైద్యులకు ఇది చాలా ఉపయోగకరమైనదని రాబోయే కాలంలో మన సాంప్రదాయ వైద్యం నిలబడాలన్నా ఇప్పుడు ఈ అవకాశం ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ నమోదు కార్యక్రమం ను మన వైద్య శ్రీ రమణ ఆధ్వర్యంలో జరుగుతునందుకు మన వైద్యుల కొరకు వారు పడుతున్న కష్టంనకు వైద్యుల తరుపున గతంలో కూడా వైద్య రమణ చేసిన సదస్సులు, సేవలను గుర్తించి ప్రస్తుతం వైద్యుల నమోదు కార్యక్రమం మొదలు పెట్టినందుకు వారికి అభినందనలు తెలిపారు. మన వైద్య రమణ మాట్లాడుతూ ఈ నమోదు కార్యక్రమం ఈ నెల 25 వరకు మన వైద్యులు అన్నమయ్య జిల్లాలో ఎక్కడ ఉన్న ఏ వైద్య రంగంలో ఉన్న పర్లేదు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

# సిజేఐపై దాడి దేశానికే సిగ్గుచేటు

## వీసికే పిటిఎం శివప్రసాద్

**మదనపల్లె, అక్టోబర్ 12 ప్రభాతవార్త :**

సిజేఐపై దాడి దేశానికే సిగ్గుచేటని వీసికే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్ నందు వీసికే పార్టీ, భారతీయ అంబేద్కర్ సేన సంయుక్తగా నిరసన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయ్ మీది ఇటీవల జరిగిన దాడి దేశానికే సిగ్గుచేటు అన్నారు. సిజేఐ దళితుడు కాబట్టే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడిపై స్పందించలేదని ఆరోపించారు. ప్రజలు న్యాయం పొందడానికి ఉన్న చివరి ఆశ్రయం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అని ఆయనకే రక్షణ కల్పించలేని కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. ఈ ప్రభుత్వం దేశ ప్రజలకు ఏం రక్షణ కల్పిస్తుందని ప్రశ్నించారు. అనంతరం పోస్టల్ విశ్రాంత సూపరిండెంట్ చిన్నకేశవులు మాట్లాడుతూ సిజెఐపై జరిగిన దాడి మన న్యాయ వ్యవస్థపైన, రాజ్యాంగంపైన, దేశంపైన జరిగిన దాడిగా పరిగణించాల్సి ఉందన్నారు. ఈ దాడిపట్ల ముఖ్యమంత్రి కాని, ప్రతిపక్షనేత కాని స్పందించకపోవడం శోచనీయమన్నారు. సిజెఐపై జరిగిన దాడిని ప్రజలకు వివరించి ప్రజా ఉద్యమం నిర్మించేందుకు బాస్, వీసికే శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీరుగట్టురమణ, రెడ్డప్ప, గంగాధర్, జివి.రమణ, సింగన్న, శ్రీనివాసులు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

# దివానే మస్తాన్ వలీ ఖాద్రిదర్గాలో ఉరుసు

**రామసముద్రం అక్టోబర్ 12 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని దిగువపేటలోని దివానే మస్తాన్ ఖాధరీవల్లీ దర్గాలో మంగళవారం 62వ గంధపు మహోత్సవం హిందూ, ముస్లిం సోదరులు ఐక్యమత్యముతో ఉరుసు నిర్వహిస్తున్నట్లు మంగళవారం సాయంత్రం 6గంటల నుండి 8గంటలవరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉరుసులో మంగళవారం రాత్రి జరగబోయే ఫాతేహా, గంధపు మహోత్సవం, అన్న దానం నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి కర్ణాటకకు చెందిన ప్రముఖులుచే కవ్వాలి ఉంటుందని దర్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు.

# అనాధశవానికి అంత్యక్రియలు

**జమ్మలమడుగు, అక్టోబరు 12 , ప్రభాతవార్త:**



జమ్మలమడుగులో బిక్షాటన చేస్తూ రఘు అనారోగ్యంతో మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ అహమ్మద్ హుసేన్‌ను ఆదివారం సంప్రదించారు. స్పందించి హిందూ స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ ఛైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ అహమ్మద్ హుసేన్, సుబహాన్, వైస్ ప్రెసిడెంట్ మునీంద్రా, అగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు సుమన్‌బాబు, సురేష్, ప్రసన్న, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. మా శ్రీ అమ్మ శరణాలయంలోని వృద్ధులకు సహాయం చేయదలచిన దాతలు ఎవరైనా ఉంటే 8297253484, 9182244150 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# ఓటర్ల హక్కుల పరిరక్షణపై అవగాహన



**ప్రొద్దుటూరు అక్టోబర్ 12, ప్రభాతవార్త**

ఓటర్ల హక్కుల పరిరక్షణకై ప్రతి ఇంటికి వెళ్లి ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎస్ ఇర్ఫాన్ భాష అవగాహన కల్పించారు. ఆదివారం ప్రొద్దుటూరు మండలం బొజ్జావారిపల్లెలో గ్రామంలో ఆయన ఓటు చోరీని అరికట్టాలని సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలు పార్టీకి చేరుస్తానని హామి ఇచ్చారు. ప్రజాస్వామ్య విలువల కోసం కాంగ్రెస్ పోరాటం చేస్తుందని తెలిపారు. మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల సమస్యలు కేంద్ర నిర్లక్ష్యం కారణమని ఆరోపించారు. రాహుల్ గాంధీ, షర్మిల రెడ్డి పిలుపుతో కాంగ్రెస్ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, డీసీసీ సెక్రెటరీ అప్పపోగులు ఎల్లయ్య, గౌస్, ఖలందర్, రమణా రెడ్డి, మరియు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి...



**రామసముద్రం, అక్టోబర్ 12 ప్రభాతవార్త**

యేసు ప్రభు దీవెనలు అన్ని వర్గాల ప్రజలపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో తులతుగాలని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆకాంక్షించారు. ఆదివారం మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండలం చెంబకూరు సియోన్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి నిర్వహకులు, క్రిస్టియన్ మత పెద్దలు, స్థానిక వైసిపి నాయకులు నిస్సార్ అహమ్మద్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో నిస్సార్ అహమ్మద్ పాల్గొన్నారు. అనంతరం చర్చ ఫాదర్ జాన్ ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం నిస్సార్ అహమ్మద్ మీడియాతో మాట్లాడుతూ యేసు ప్రభువు దీవెనలు అన్ని వర్గాల ప్రజలపై ఉండాలని, సర్వమత సామరస్యం యేసు క్రీస్తు ఆకాంక్ష అని, ప్రజలకు మంచి జరగాలని, కులం ఏదైనా మతం ఏదైనా మనుషులంతా ఒక్కటే అనే భావంతో సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే మనిషి జన్మకు సార్థకం లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నిస్సార్ అహమ్మద్ తోపాటు ఫాస్టర్ జాన్, పాల్ చంద్రశేఖర్, రిచర్డ్, రాజేష్, రఘునాథరెడ్డి, జి. కె.చంద్ర, తిప్పరాజు,రవి,షంషీర్, షఫీ, ఎల్‌విపి శ్రీనివాసులు, విజయ్ రాజు, బషీర్, జింకల శ్రీనివాసులు, రాజన్న, ఈశ్వర్ రెడ్డి, నూర్ మొహిద్దీన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# నిరాశ్రయులకు నిత్యవసర వస్తువులు పంపిణీ



**ముద్దనూరు,అక్టోబర్ 12, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కోడిగాండ్ల పల్లె గ్రామ సమీపంలో ఉన్న యేసు కరణాలయం అనాధ వికలాంగుల ఆశ్రమంలో జమ్మలమడుగు పట్టణం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం కె రవీంద్ర వారి సతీమణి వేద ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులు పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మా రెడ్డి వెంకట్ కృష్ణారెడ్డి తెలిపారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ రోటరీ సంస్థ ఆధ్వర్యంలో అనేక రకాల సామాజిక ,సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడమే రోటరీ క్లబ్ సంస్థ ప్రధాన ఉద్దేశ్యము అన్నారు. గవర్నర్ అనాధలకు 5000 రూపాయలు నగదును ఆర్థిక సహాయాన్ని ఏసు కారణాలయం పాస్టర్ మర్రెడ్డికి అందజేసినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జోనల్ సెక్రటరీ కుండా భాస్కర్, రోటరీ ట్రెజరర్ యమ్.ఓబుల్ రెడ్డి,సభ్యులు శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జస్టిస్‌పై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

**కలసపాడు, అక్టోబర్ 12ప్రభాత వార్త:**

అత్యున్నత న్యాయస్థానంలో చీఫ్ జస్టిస్‌గా విధులు నిర్వహిస్తున్న చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయి పై దాడికి పాల్పడిన దుర్మార్గుడిని కఠినంగా శిక్షించాలని కలసపాడు మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షుడు తిమోతి ప్రధాన కార్యదర్శి గుడిమే రామ్మోహన్ లు డిమాండ్ చేశారు. ఆదివారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు గుండాల ఈశ్వరయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ కడప జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేష్ మాదిగ, రాష్ట్ర నాయకులుజిల్లా అధ్యక్షులు మాతయ్య మాదిగ జాతి నాయకులు పత్రికా విలేకరులతో మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానంలో విధులు నిర్వహిస్తున్న జస్టిస్ గవాయి దాడి చేసిన దుండగుడి వెనుక ఉన్నటువంటి వ్యక్తులు లేదా వ్యవస్థల ను గుర్తించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నకిలీ మద్యం కేసుపై నేడు వైకాపాచే నిరసనలు

## నిందితుల కోసం గాలిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

## తంబళ్ళపల్లె నియోజకవర్గంలో డీలా పడుతున్న టిడిపి


ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్

**మదనపల్లె, అక్టోబర్ 12 ప్రభాతవార్త :**

ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసు విషయంపై సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ములకలచెరువు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదుట నియోజకవర్గ వైకాపా నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ మేరకు వైకాపా అధిష్ఠానం పిలుపునిచ్చింది. తంబళ్ళపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని వైసిపి జడ్పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైకాపా నాయకులు, కార్యకర్తలు ములకలచెరువు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద చేపట్టే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓవైపు ఎక్సైజ్ పోలీసులు నకిలీ మద్యం తయారీ కేసుకు సంబంధించి నిందితులను పట్టుకునేందుకు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధానంగా నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఇన్‌చార్జ్ దాసరపల్లె జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది మంత్రి గిరిధర్‌రెడ్డిలను అరెస్టు చేసేందుకు ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలిస్తున్నారు. ప్రస్తుతం వారు ఇద్దరూ దక్షిణాఫ్రికాలో ఉన్నట్లు సామాజిక మాధ్యమాల ద్వారా తెలిసింది. వీరు బెంగుళూరు ఎయిర్‌పోర్టుకు రాగానే అరెస్టు చేసేందుకు ఎయిర్‌పోర్టులోని ఎక్సైజ్ పోలీసులు కాపు కాస్తున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న కట్టా సురేంద్రనాయుడు, జనార్ధన్‌రావులతో పాటు జయచంద్రారెడ్డి కారు డ్రైవర్ అష్రఫ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. తంబళ్ళపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ రోజు రోజుకు డీలా పడుతున్నట్లు తెలుస్తోంది. అధికారంలో ఉండి నియోజకవర్గంలో కార్యకర్తలకు, ప్రజలకు సరైన నాయకత్వం లేక బలహీనపడుతున్నట్లు తెలుస్తోంది.

# కట్టా పుట్టాలమ్మ దేవాలయంలో చోరీ

**ఓబులవారిపల్లి అక్టోబర్ 12 ప్రభాతవార్త**




మండలంలోని మంగంపేట అగ్రహారం వద్ద వెలసిన కట్ట పుట్టాలమ్మ దేవాలయంలో ఇటీవల దేవాలయం తాళాలు పగలగొట్టి ఉండీను కూడా పగలగొట్టి అందులో ఉన్న నగదును చోరీ చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. విషయం పోలీసులు తెలియడంతో చోరీ జరిగిన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మద్యంబాబులు మద్యానికి బానిసై ఉన్నవారు ఇలాంటి పనులు చేసి ఉంటారని అనుమానాలు ఉన్నాయన్నారు. సీసీ కెమెరాలు బిగించుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# పేట చెరువుకు మరమ్మత్తులు



**పెద్దమండెం అక్టోబర్ 12 ప్రభాతవార్త**

మండలంలోని సిద్దవరం పంచాయతీ మల్లయ్య గారి పల్లి సమీపంలో ఉన్న పేట చెరువుకు గత శనివారం కురిసిన భారీ వర్షాలకు వేటచెరువు ప్రమాదాన్ని ప్రజలు గుర్తించారు చెరువుకు నీట ప్రవాహం అధికం కావడంతో చెరువు తెగిపోవడానికి సిద్ధంగా ఉందని ఎంపీడీవో శ్రీధర్ రావుకు తెలిపారు దీంతో ఎంపీడీవో స్పందించి చెరువును సందర్శించి మరమ్మతు పనులు చేపట్టారు శ్రీ గణేష్ పరిసరాల అభివృద్ధి సంస్థ ద్వారా చెరువుకు జెసిబి సహాయంతో మట్టిని తొలి కట్ట తెగిపోకుండా చర్యలు చేపట్టారు దీంతో గ్రామంలోని ప్రజలు ప్రమాదం నుండి బయటపడ్డారన్నారు. మండలంలో ఇలాంటి పరిస్థితులు ఎక్కడ ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో శ్రీధర్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు టిడిపి మాజీ మండల అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**కలికిరి, అక్టోబరు 12, ప్రభాతవార్త:**

మండలంలోని మేడికుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1968-69 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు ఓబుల్‌రెడ్డి, రాజారెడ్డి, రాధాకృష్ణ, నారాయణ, డ్రాయింగ్ షరీఫ్ సాహెబ్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో సయ్యద్ సాహెబ్, జయరత్నమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డికుమార్ తదితరులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు అందరూ ఒక చోట చేరి ఒకరినొకరు మాట్లాడుకొని తమ యోగక్షేమాలు తెలుసుకున్నారు. 50 సంవత్సరాల తరువాత మళ్లీ ఒక చోట చేరడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. తాము చదువుకున్న పాఠశాలకు సహాయ సహకారాలు అందించేలా నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కలికిరి ఎంఈవో కరీముల్లా, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

# దేశ ప్రజల కోసం శ్రమించే ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్

**కలికిరి, అక్టోబరు 12, ప్రభాతవార్త:**

దేశ ప్రజలను కాపాడే ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ అని ఆర్ఎస్ఎస్ నాయకులు భానుప్రకాష్ అన్నారు. కలకడ మండలం కదిరాయచెరువు పంచాయతీలో ఆదివారం స్థానిక సర్పంచ్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో ఆర్ఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా నాయకులు భానుప్రకాష్ మాట్లాడుతూ దేశ ప్రజలను కాపాడుకోవాలని ప్రయత్నించిన ఆర్ఎస్ఎస్ నేడు దేశం కోసం శ్రమించే ఏకైక సంస్థగా నిలిచిందన్నారు. స్వాతంత్యం వచ్చే సమయంలో జమ్ము ప్రాంతాన్ని పాకిస్తాన్‌లో కలిసిపోయే సమయంలో ఆర్ఎస్ఎస్ పోరాటంతో ఇప్పుడు అది భానతదేశంలో ఒక భాగంగా ఉందనేది గుర్తుంచుకోవాలన్నారు. 1952లో గోవధ నిషేధం జరగాలని గోవులను రక్షించాలని ప్రయత్నించిందని మన ప్రాంతంలోని ప్రతి ఊర్లో రాముడి గుడి ఉందని కానీ రాముడి జన్మించిన ప్రదేశంలో రాముడి గుడి లేకపోవడం సిగ్గుచేటని భావించి 1992 నుంచి 2024 వరకు పోరాటం చేసి అయోధ్యలో రామ మందిరం నిర్మించడం కోసం పోరాట చేసిన ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఖండ కార్యవాహ ప్రొద్దుటూరు మధుసూదన, చోట వెంకటరమణ, ఎస్ఎస్ఎఫ్ మండల ప్రముఖ్ వెంకటేష్, పీలేరు నియోజకవర్గ సర్పంచ్ సంఘం అధ్యక్షులు మరియు కదిరాయచెరువు సర్పంచ్ లక్ష్మీప్రసన్న, కమలనాథ్, వైస్ సర్పంచ్ గోపాల్ నాయుడు, మధు, రెడ్డిలక్ష్మి, రామకృష్ణ, భాస్కర్, గౌరం శ్రీనివాసులు, ప్రజలు పాల్గొన్నారు.

# కుంట మరవ స్థలం కబ్జా

**కలికిరి, అక్టోబరు 12, ప్రభాతవార్త:**


నడిరోడ్డులో ప్రవహిస్తున్న నీరు

కలికిరి-కలకడ రోడ్డు మార్గంలో శ్రీ అంకాళమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న కుంట మరవ స్థలం ఆక్రమణకు గురైంది. ఆ స్థలంపై అక్రమ దారులు కన్నేసి కట్టడాలు నిర్మించారు. దీంతో కుంటలోని నీరు మరవ ద్వారా బయటకు వెళ్లేందుకు వీలు లేక నడిరోడ్డుపైన నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కుంటలో నీరు చేరి కుంట నిండిపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చెరువు, కుంట స్థలాలు యథేచ్ఛగా కబ్జాచేస్తూ ఆక్రమించుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి కుంట మరవ స్థలం పరిశీలించి ఆక్రమించుకున్న అక్రమణదారులపై చర్యలు తీసుకొని కుంట మరవ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు.

# కలికిరి పోలీసు స్టేషన్‌లో దసరా వేడుకలు

**కలికిరి, అక్టోబరు 12, ప్రభాతవార్త:**

కలికిరి పోలీసు స్టేషన్‌లో ఆదివారం కలికిరి సీఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయుధ పూజ నిర్వహించారు. దీంతో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన టోషిత్ ఆరిన్

ప్రొద్దుటూరు అర్బన్ అక్టోబర్ 12 ప్రభాత వార్త:



ప్రొద్దుటూరుకు చెందిన చీకటి పుష్పాంజలి కుమారుడు టోషిత్ ఆరిన్ కడపలో జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలలో బ్రాంజ్ మెడల్ సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో టోషిత్ ఆరిన్ పాల్గొంటున్నట్లు కోచ్ నాగేశ్వరరావు తెలిపారు.

## సేవా కార్యక్రమాలు చేయడమే ధ్యేయం



జమ్ములమడుగు, అక్టోబరు 12, ప్రభాతవార్త:

జమ్ములమడుగు పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జమ్ములమడుగు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ డిస్ట్రిక్ట్ 3160 గవర్నర్ ఎం.కె.రవీంద్ర, అసిస్టెంట్ గవర్నర్ కె.వి.మురళీధర్‌రెడ్డి చేతుల మీదుగా మొక్కలను నాటినట్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి మరియు సెక్రటరీ సంజీవ రాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఎం.కె.రవీంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిసరాలను కాపాడుకోవాలన్నారు. మొక్కలను నాటి భావితరాల భవిష్యత్తుకు బాసటగా నిలవాలన్నారు. అనంతరం గూడెం చెరువులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినిలకు జమ్ములమడుగు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని పరీక్ష అట్టలు, కంబాక్స్‌లు, పెన్నులను పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జోనల్ సెక్రటరీ కుండా భాస్కర్ పాస్ట్ ప్రెసిడెంట్ పాల నాగేశ్వరరెడ్డి, పాస్ట్ సెక్రటరీ పార్థసారధి పెద్దలు రోటరీ సభ్యులు శ్రీనివాసులు, తిరుపతయ్య, సూర్య నారాయణ, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత గుండె చికిత్స వైద్య శిబిరానికి విశేష స్పందన



వేంపల్లె :అక్టోబర్ 12:(ప్రభాత వార్త)

స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న దారుల్ ఉలూమ్ రహమానీయ మసీదు ఆవరణంలో చేపట్టిన ఉచిత గుండె వైద్య శిబిరానికి రోగుల నుండి విశేష స్పందన లభించినట్లు మదరాసా ప్రతినిధులు తెలిపారు. ఆదివారం చెన్నైకు చెందిన ఆక్సిమెండ్ హాస్పిటల్ సహకారంతో దారుల్ ఉలూమ్ రహమానీయ మదరాసా ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఆక్సిమెండ్ హాస్పిటల్ కు చెందిన గుండె వైద్యులు ఆయాజ్ అక్బర్, సామా అక్బర్ లు రోగులకు వైద్య పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి మందులు కూడ ఉచితంగా పంపిణీ చేశారు. ఉదయం 9 గంటల నుండి 4 గంటల వరకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి దాదాపు 250 మంది రోగులు వచ్చి పరీక్షలు చేయించుకున్నట్లు మదరాసా ప్రతినిధులు తెలిపారు. రక్త పరీక్షలు, బిపి పరీక్షలతో పాటు ఇసిజి, ఎకో పరీక్షలు కూడ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆక్సిమెండ్ హాస్పిటల్ సిబ్బంది, మదరాసా కమిటీ ప్రతినిధులు, మదరసా విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

పెండ్లిమర్రి, అక్టోబరు 12, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలం మాచునూరు నందు ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.చౌటపల్లె గ్రామంలో జిల్లా ప్రచార్ ప్రముఖ్ మురళీమోహన్‌రెడ్డి, ఖండి శీదిరక ప్రముగ్ జయదేవ్, సంగటి రామమోహన్‌రెడ్డి, లింగాల రామ మునిరెడ్డి, కె.మధు మరియు సంఘ సేవకులు పాల్గొన్నారు.

## సాంబాకు గ్లోబల్ హ్యూమన్ ఫేస్ యూనివర్సిటీ అవార్డు

మైదుకూరు, అక్టోబర్ 12, ప్రభాతవార్త:




మైదుకూరు మండలం ముసల్ నాయని పల్లి గ్రామానికి చెందిన వీరమల్లు పుల్లయ్య కుమారుడు సాంబ శివయ్య 108 లో పనిచేస్తూ చాలామందికి బ్లడ్ డొనేట్ చేయడం ఇతరులకు బ్లడ్ అవసరమైతే సోషల్ మీడియా ద్వారా గ్రూపుల్లో షేర్ చేసి అవసరానికి బ్లడ్ ఇప్పించడం సోషల్ మీడియాలో యాక్టివ్ గా వర్క్ చేయడం వల్ల గ్లోబల్ హ్యూమన్ ఫేస్ యూనివర్సిటీ వారు పాండిచ్చేరి నందు కందం ఆడిటోరియంలో అచీవ్ అవార్డు ప్రధానం చేయడం జరిగింది. ఈ అవార్డు ఇచ్చిన గ్లోబల్ హ్యూమన్ ఫేస్ యూనివర్సిటీ వారికి ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా సమాజంలో ఆయన వంతు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని మీడియా ద్వారా తెలియజేస్తూ వారి తల్లిదండ్రులకు ఆదిరెడ్డి పల్లె సచివాలయ గ్రామాల లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎవరికైనా బ్లడ్ అవసరమైతే సంప్రదించ వలసినదిగా కోరారు.

## సేవే లక్ష్యంగా
## ముందుకు సాగుతున్న గల్ఫ్ జనసేన..

సుండుపల్లి, అక్టోబర్ 12, ప్రభాతవార్త:

కార్యవర్గానికి వెన్నుదండుగా ఎన్నో సంవత్సరాలనుండి ప్రయాణం సాగిస్తూ పార్టీ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొంటూ ఎటువంటి ఆర్థిక సహాయం కావాలన్న ముందుండే చీర్ల. మల్లికార్జున, చల్లా. మల్లికార్జున రెడ్డి వీరికి గల్ఫ్ జనసేన జాతీయ కన్వీనర్ కంచన. శ్రీకాంత్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యుల సమక్షంలో సన్మానించడం జరిగిందని శ్రీకాంత్ తెలియజేశారు. అలాగే కువైట్ లో సేవకు మారుపేరుగా ముందుండే జనసేన పార్టీ బలోపేతం కోసం మరింత పటిష్టం గా ముందుకు సాగుతూ మరెంతో మంది జనసేన పార్టీ మద్దతుదారులను కలుపుకుని గల్ఫ్ దేశంలో మేము జనసైనికులం ఉన్నామంటూ భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్నాము అనిఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో గల్ఫ్ జనసేన పార్టీ కువైట్ కోకన్వీనర్లు దండు. చంద్రశేఖర్, షేక్ అలి, జిగిలి ఓబులేసు, కోలా మురళి యూత్ నాయకులు అల్లం ప్రేమ్ రాయల్, కొమ్మినేని బాలాజీ, మొగిలుశెట్టి మనోహర్, రెడ్డిచర్ల, ఆంజనేయులు, పసుపులేటి రాజేష్, అప్పిన చిరంజీవి, బాషా తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సార్ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 12, ప్రభాతవార్త:



సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థ ఆల్ డీజీ టెక్ లిమిటెడ్ వారు శనివారం ఆదివారం బీటెక్ అన్ని బ్రాంచ్‌ల ఫైనలియర్ విద్యార్థులకు ఎగ్జిక్యూటివ్ సపోర్ట్ ఆఫీసర్ ఉద్యోగాలకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో సీఎస్ఈ బ్రాంచ్ నందు 17 మంది, ఈసీఈలో 5 మంది, ఈఈఈ నుంచి ఇద్దరు మొత్తం 24 మందది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.6లక్షలు వేతనంతోపాటు ఇన్‌సెంటీవ్‌లు ఉంటాయని టీపీవో సునీల్ చెప్పారు. ఈ సందర్భంగా బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీలు అభినందించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

రాజంపేట టీడీపీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు



సిద్ధవటం అక్టోబర్12 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఎంతో ఊరట కలిగిస్తుందని రాజంపేట తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. ఆదివారం సిద్ధవటం మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీలోని బాకరాపేట కు చెందిన మలికే వెంకటమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో వైద్య చికిత్సలు చేయించుకున్నారు. సీఎం సహాయనిది నుండి వైద్య ఖర్చుల నిమిత్తం 68,987 చెక్కును వారి కుటుంబ సభ్యులకు ఆదివారం రాజంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అందించామని నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఊరట లభిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శనివారం మోహన్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ మరియు మండల క్లస్టర్ ఇంచార్జ్ గారపునేని దశరథ రామానాయుడు, పెద్దపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి తూర్రా ప్రతాప్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు

## పట్టు వస్త్రాలు బంగారు ఆభరణాలతో బోయకొండమ్మ

సుండుపల్లి, అక్టోబర్ 12, ప్రభాతవార్త:



మండల పరిధిలోని జగనన్న కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న శ్రీ బోయకొండమ్మ తల్లిని ఆదివారం ఉదయాన్నే పూజారి అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారని, అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారని, పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారని అర్చక స్వామి తెలియజేశారు.

## విద్యార్థులు కోకో జిల్లా స్థాయిలో ప్రతిభ

మైదుకూరు, అక్టోబర్ 12, ప్రభాతవార్త:



కడప జిల్లా మైదుకూరు మండలానికిచెందిన మహాత్మ జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల బాలికల సంక్షేమ పాఠశాలలోని విద్యార్థులు శనివారం జరిగిన సంజీవపురంలో జరిగిన యు19లో కోకో జిల్లా స్థాయిలో ప్రతిభను కనబరిచి పి.కుసుమ10వ తరగతి, బి.దివ్య 9వ తరగతి విద్యార్థినిలు రాష్ట్ర స్థాయికి ఎంపిక అవ్వడం జరిగినది. ఈ ఆట నందు హిమబిందు అనే విద్యార్థిని కూడా స్టాండ్ బైలో తీసుకోవడం జరిగింది.

## ప్రాంగణ ఎంపికల్లో ఆదిత్య విద్యార్థులకు ఉద్యోగాలు

మదనపల్లె, అక్టోబర్ 12 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డునందు గల ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 18మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. ఎకోబ్రైయిన్స్ సంస్థచే ఈ ప్రాంగణ ఎంపికలు జరిగాయాన్నారు. ఆసంస్థ హెచ్ఆర్ మేనేజర్ హేమంత్ ఆధ్వర్యంలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.3.05లక్షలు వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ అభినందిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అదిరోహించాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాముడు, ప్లేస్‌మెంటు అధికారి మనోజ్‌కుమార్, వివిధ విభాగాదిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం జిల్లా అధ్యక్షులుగా నాగూనాయక్

మదనపల్లె, అక్టోబర్ 12 ప్రభాతవార్త :



అన్నమయ్యజిల్లా ఆల్ ఇండియా బంజారాసేవా సంఘం (ఏఐబిఎస్ఎస్) అధ్యక్షులుగా మదనపల్లెకు చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గిరిజన సంఘం నాయకులు నాగూనాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలో ఆల్ ఇండియా బంజారాసేవా సంఘం అన్నమయ్య జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.చక్రినాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంబాబు నాయక్‌లు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరి సమక్షంలో అన్నమయ్య జిల్లా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నూతన అధ్యక్షులుగా బి.నాగూనాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈయన మదనపల్లె నియోజకవర్గంలో బంజారాల కులానికి సంబంధించి ముఖ్య నాయునిగా కొనసాగుతున్నారు. గతంలో బంజారాలు ఎక్కువ నివసించే నక్కలదిన్నె ప్రాంతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలుపొంది పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. ముఖ్యంగా నక్కలదిన్నె ప్రాంతంలో నివసించే బంజారాల(సుగాలి)కు సంబంధించి బ్యాంకు రుణాలు, ఇంటి పట్టాలు, నివాసగృహాలు మంజూరు అయ్యేలా కృషి చేశారు. మదనపల్లె నియోజకవర్గంలో ఉన్న పలు తాండాల్లో పర్యటించి బంజారాల సమస్యలను పరిష్కారం చేశారు. ఇలా వారి కులానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న నాగూనాయక్‌ను ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. త్వరలోనే జిల్లాలో ఉన్న ప్రతి తాండాల్లో పర్యటించి బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేస్తానని నాగూనాయక్ తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లాలోని ప్రతి మండలంలో కమిటీలను వేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.శంకర్‌నాయక్, కోశాధికారిగా బనావత్ రవీంద్ర నాయక్, యూత్ కన్వీనర్‌గా మూడే మనోజ్‌కుమార్ నాయక్ ఎన్నికైన వారిలో ఉన్నారు.

# బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే దేశాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ ఎస్ ఎస్ సంఘం నాయకులు



హాజరైన సంఘం సభ్యులు

పులివెందుల అక్టోబర్ 12 ప్రభాత వార్త :

ప్రతి వ్యక్తి వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందనీ ఆర్ఎస్ఎస్ సంఘం నాయకులు అన్నారు. పులివెందులలోని సరస్వతి విద్యా మందిరం పాఠశాల మైదానంలో ఆర్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విజయదశమి ఉత్సవంలో ముఖ్య వక్తగా ఆర్ఎస్ఎస్ విభాగకార్య కత్తి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 లో డాక్టర్ కేశవరామ్ బలిరామ్ హెడ్గేవార్ విజయదశమి నాడు ప్రారంభించిన సంఘం గత 100 సంవత్సరాలుగా మానవ విలువలను పెంపొందిస్తూ వ్యక్తి నిర్మాణం, ధార్మిక, సాత్విక శక్తి ఉపాసకులుగా నిర్మాణం చేస్తూ విజయ పరంపర కొనసాగిస్తున్న దన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సరస్వతి విద్యా మందిరం పాఠశాల కమిటీ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ మాట్లాడుతూ వ్యక్తి తాను నిర్వహించవలసిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. నేడు కూడా హిమాలయ పర్వతాలలో ఎందరో మహా ఋషులు కఠోర దీక్షలు చేస్తున్నారని, అందుకు ప్రతిఫలంగా మనమందరం ఇక్కడ ప్రశాంతంగా జీవిస్తున్నామని అన్నారు. దేవుళ్ళు పుట్టిన ఈ పుణ్య భూమిలో ప్రజల నడుమ ఎలాంటి కలహాలు లేకుండా, సర్వ మాత సహనం పాటిస్తూ అందరిని కలుపుకొని పోతున్నామన్నారు. పండుగల సందర్భాలలో కుటుంబ సమేతంగా దేవాలయాలకు వెళ్లడం వలన మనసులలో ఉన్న కల్మషాలు దూరం అవుతాయని తెలిపారు. విజయదశమి ఉత్సవం లో భాగంగా సభా స్థలి వద్ద ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ సర్వేశ్వర్ రెడ్డి ఆర్ఎస్ఎస్ ఆర్ఎస్ఎస్ కడప జిల్లా ఫిజికల్ డైరెక్టర్ శ్రీకాంత్ రిటైర్డ్ ఎంపీడీవో రాఘవరెడ్డి ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



గాలివీడు, అక్టోబర్ 12(ప్రభాతవార్త):

రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం ఒక్క చంద్రబాబుకే సాధ్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని అరవీడు పంచాయతీలో పర్యటించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సర కాలంలోని ప్రజలకు అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం జరిగిందన్నారు. అర్హులైన 64 లక్షల మంది విద్యార్థులకు తల్లుల అకౌంట్లలో ఒక్కొక్కరికి రూ.13 వేలు జమ చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడంతో పాటు మహిళలకు సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేయడం జరిగిందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కొక్క రైతుకు మొదటి విడతలో రూ.6 వేలు అందజేయడం జరిగిందని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఎంతో ప్రయోజనం కలుగుతున్నదని చెప్పారు. చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రజలకు సూపర్ పాలన అందించడం జరుగుతున్నదని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటి నెరవేరుస్తూ వస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి కొన్నింటిని అధికారులతో మాట్లాడి అక్కడే సమస్యలను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొదలు కానున్న కడప రేణిగుంట గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు



సిద్ధవటం అక్టోబర్ 12 ప్రభాతవార్త

గత నాలుగేళ్లగా నిలిచిపోయిన కడప, రేణిగుంట గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాజెక్టు కదలిక ప్రారంభమైంది రాష్ట్రంలో కుటుంబ ప్రభుత్వం ఏర్పడ్డాక రహదారుల మహర్దశ కడప , రేణిగుంట గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రారంభ దిశలు మొదలు కావడంతో మండల వాసులకు చెప్పలేని ఆనందం మొదలై మండల అభివృద్ధికి గ్రీన్ ఫీల్డ్ హైవే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండలవాసులు తెలిపారు మండలంలోని గ్రామ శివారులోని జేఎంజే కాలేజ్ సమీపం నుండి కడప రేణిగుంట, గ్రీన్ ఫీల్డ్, హైవే రోడ్డుకు పాతిన హద్దులలో ఆదివారం కనుములోపల్లి, భాకరాపేట, మిట్టపల్లి మాధవరం గ్రామాల అటవీ ప్రాంతాలలో టిడిపి పార్టీ జిల్లా అధ్యక్షుడు రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్ప గారి శ్రీనివాసులు రెడ్డి (వాసు) గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు పరిశీలించి ఈ కీలక ప్రాజెక్టుకు కేంద్ర వన్యమృగ సంరక్షణ బోర్డు ఎట్టకేలకు ఆమోదముద్ర వేయడంతో 3,150 కోట్ల వ్యయంతో రెండు దశలుగా చేపట్టబోయేఈ ప్రాజెక్టులో మొదటి దశకు ఇప్పటికే అటవీ శాఖ అనుమతులు లభించాయి రెండో దశకు తాజాగా వన్యమృగ సంరక్షణ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అధికారులు పర్యటించారు గ్రీన్ ఫీల్డ్ హైవే సమస్యలపై రైతులకు ఏమైనా ఇబ్బంది కరంగా ఉంటే తెలపాలని రైతులను ఉద్దేశించి టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు చేనేత కార్మికులు ఆయనకు ఘనంగా సత్కారం చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి యువనేత, జింక శ్రీనివాసులు పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉక్కడాల శివ, జొన్నాదుల శివ రైతులు పాల్గొన్నారు.

## 28 న మఠాధిపతి నియామకం కొరకు సమావేశం..

బ్రహ్మంగారిమఠం అక్టోబర్ 12 ప్రభాతవార్త :



భూత భవిష్యత్ వర్తమాన కాల జ్ఞానాన్నీ రచించిన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం పూర్వపు మఠాధిపతి శ్రీ వీర భోగ వసంత వెంకటేశ్వర స్వామి వారు శివైక్యం పొందిన తరువాత మఠాధిపతి ఎంపికపై కుటుంబ సభ్యుల్లో నెలకొని ఉన్న అనైక్యత భావం వల్ల కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసినదే. ఈ విషయంపై రాష్ట్ర అత్యున్నత హైకోర్టు(న్యాయస్థానం) ఇరువురి వాదనలు విన్న తర్వాత హైకోర్టు బ్రహ్మంగారిమఠం మఠాధిపతి నియామక అంశం కొరకు ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖకు ఈ విషయం అప్పజెప్పగా ధార్మిక పరిషత్ వారు నియమించిన దేవాదాయ శాఖ అధికారులు మఠాధిపతి నియామక అంశంపై ఈనెల 28వ తేదీన బ్రహ్మంగారి మఠం ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయ శాఖ ఆర్థరైజ్ అధికారి మరియు ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మఠాధిపతి నియామక అంశం పైన అభిప్రాయ స్వీకరణలో హిందూ సాంప్రదాయక చెందిన మఠాధిపతులు మరియు స్వామివారి శిష్యులు సంబంధిత మఠాధిపతులు ఆశావాహులు కందిమల్లయ పుర సంస్థానం ప్రజలు పాల్గొని వారి యొక్క సలహాలను తెలపవచ్చునని వారు ప్రకటనలో తెలిపారు. ఎవరైనా రాలేని వారు తమ అభిప్రాయాలను రాసి పోస్టు ద్వారా ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్, ఆర్థరైజ్ అధికారి, ప్రాంతీయ సంయుక్త కమిషనర్, దేవాదాయ శాఖ, మల్టీ జోన్2 తిరుపతి అనే చిరునామాకు 26వ తేది లోపు పంపగలరని ఆయన తెలిపారు.

## శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి రథోత్సవం



బ్రహ్మంగారిమఠం అక్టోబర్ 12 ప్రభాతవార్త

ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారికి నిప్పు తెచ్చిన శ్రీ కనుమ పోలేరమ్మ ఆలయం వద్ద ప్రతి మంగళ వారం,శుక్రవారం, ఆదివారం రోజున శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి గుడి చుట్టూ ఊరేగింపుగా రథోత్సవంను దేవాదాయ శాఖ కమిషనర్ రామ చంద్రమోహన్ ఆదేశాల మేరకు రథోత్సవాన్ని నిర్వహిస్తున్నామని మేనేజర్ ఈశ్వరయ్య చారి అన్నారు. ఆదివారం ఉభయ దాతలైనా నంద్యాల మూల సాగర్ వీధి వాస్తవ్యులు రెబ్బా వీరయ్య వారి ధర్మపత్ని పార్వతమ్మ కుమారుడు వీర నారాయణ కుమార్తె హరిప్రియ మరియు భక్తుల మధ్య,రథోత్సవంను నిర్వహించాము, ఈ అవకాశాన్ని భక్తులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందగలరని వారన్నారు. ఈ కార్యక్రమం లో కేశవ పూజారి, పూజారి మిథున్,సిబ్బంది గురు ప్రసాద్, ఇటుకల పవన్ కుమార్,చిన్న సుబ్బారాయుడు,భక్తులు తది తరులు పాల్గొన్ని రథోత్సవంను జయపదం చేశారు.

## విజేత అజయ్‌కు అభినందనలు..

బ్రహ్మంగారిమఠం అక్టోబర్ 12 ప్రభాతవార్త



బ్రహ్మం గారి మఠం మండలంలో స్పోర్ట్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో అంబేడ్కర్ గురుకుల కళాశాల ఇంటర్ విద్యార్థి కొట్టం అజయ్ నాలుగు వందల మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, హై జంపు మరియు లాంగ్ జంపులలో ప్రథమ స్థానం, అలాగే వంద మీటర్ల పరుగు పందెంలోనూ డిస్కస్ త్రో లోనూ ద్వితీయ స్థానం అలాగే ఖో ఖో మరియు వాలీబాల్ లోనూ ప్రథమ స్థానం సాధించి మొత్తం మండలంలోనే ఆరు మెడల్స్ సాధించాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు శ్రీ కొట్టం సంజీవ్ మరియు సామాజిక ఉద్యమ నాయకులు,కవి శ్రీ యంబడి ఈశ్వర్ బ్రహ్మం గారి మఠం వెళ్లి విద్యార్థిని అభినందించి స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు రాయపాటి పాపయ్య మరియు సోమిరెడ్డిపల్లి ప్రవీణ్ అజయ్ కి చరవాణిలో అభినందనలు తెలిపి అటుపై జోనల్ గేమ్స్ లో చాంపియన్ చేయడానికి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. తమ వంతు విద్యార్థిని ప్రోత్సహిస్తామని ఇరువురు తెలపడం జరిగింది.

## సామాన్యుడి చేతిలో వజ్రాయుధం

పీలేరు అక్టోబర్ 12 ప్రభాతవార్త:



భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) ప్రకారం సమాచార హక్కు ప్రాథమిక హక్కు అని ఆర్టీఐ కార్యకర్త తుమ్మల ధరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1976లో రాజ్ నారాయణ్ వర్సెస్ ది స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు ఆర్టికల్ 19 ప్రకారం సమాచార హక్కును ప్రాథమిక హక్కుగా పరిగణిస్తామని తీర్పు ఇచ్చింది భారత ప్రజాస్వామ్యంలో ప్రజలే యాజమాన్యులు మరియు ప్రభుత్వం పనితీరు గురించి తెలుసుకొనే హక్కు వారికి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని,పెంపొందించ డంతో పాటు పాలనా వ్యవహారాల్లో గోప్యతను నివారించి ప్రభుత్వ విధానాలను ప్రజలు తెలుసుకొనేలా రూపొందించిన చట్టమే సమాచార హక్కు (స. హ.) చట్టం దీని ప్రకారం పౌరులు కోరుకున్న సమాచారాన్ని ప్రభుత్వ అధికారుల నుంచి పొందవచ్చు ఇది ప్రభుత్వ పాలనలో బాధ్యతాయుత విధానానికి అవకాశం కల్పిస్తుంది దీన్ని ఉపయోగించుకొని ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడమేకాక అవినీతిని అరికట్టొచ్చు పారదర్శకతను పెంపొందించే విషయంలో ప్రపంచంలోనే అత్యుత్తమమైందిగా మన స.హ. చట్టం పేరుగాంచింది సామాన్యుడి చేతిలో వజ్రాయుధంగా కీర్తి గడించిన ఈ చట్టం మన దేశంలో అక్టోబర్ 12న అమల్లోకి వచ్చిందని దీని ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సహాయ పౌర సమాచార అధికారి,పౌర సమాచారం అధికారి,అప్పిలేట్ అధికారుల పేర్లు వారి ఫోన్ నెంబర్లను ప్రజలకు కనిపించే విధంగా బోర్డు మీద స్పష్టంగా రాసి ఉంచాలని డిమాండ్ చేశారు.

GITAMW SINCE 2009
GOUTHAMI
B++ NAAC
ISO 9001-2015 CERTIFIED
INSTITUTE OF TECHNOLOGY
& MANAGEMENT FOR WOMEN (AUTONOMOUS)
(Approved by AICTE, New Delhi, SBTET, AP & Affiliated to JNTUA)
Sai Nagar, Peddasettypalli(V), Proddatur, Kadapa (Dt), A.P.
gitamwpdtr@gmail.com, Cell: 9848349885,9849570557, 9642076632
SPOT & CAT-B ADMISSIONS FOR AP EAPCET-2025
COURSES : CSE, CSE (AI&ML), ECE, EEE
Applications are invited from the eligible Candidates who are intersted to Join, can attend SPOT & CAT-B ADMISSIONS Process from 13.10.2025 to 18.10.2025, with required fee and Original Certificates in the College Premises. Admissions will be made as per guidelines given by Convener, AP EAPCET-2025.
-PRINCIPAL